# చట్టం

సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

నిజామాబాద్
మంగళవారం
01.09.2026

సంపుటి : 16 సంచిక: 336
పేజీలు: 8 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్




## శోకంతో మొదలై శిఖరానికి..

ప్రపంచ ఫుట్‌బాల్‌లో అర్జెంటీనా అంటే ఓ జట్టు కాదు. సగటు అభిమాని గుండెచప్పుడు. మైదానంలో నీలం-తెలుపు వర్ణంలోని అర్జెంటీనా పదో నంబర్ జెర్సీ ధరించి మైదానంలోకి రావడం అంటే ఒక ఆట మాత్రమే కాదు.. ఒక దేశ భారాన్ని, కోట్లాది మంది ఆశలను భుజాన మోయడం..! ఒకప్పుడు డిగో మారడోనా అనే సాకర్ మాంత్రికుడు ఆ జెర్సీలో రెండు దశాబ్దాల పాటు అర్జెంటీనానే కాదు.. సాకర్ ప్రపంచాన్నే ఏలాడు. అంతటి మహాశక్తి, మర్రిచెట్టు లాంటి ఆటగాడి నీడలో జట్టులోకి వచ్చి 'ఈ కుర్రాడు మనకు కప్పు తెస్తాడా?' అనే అనుమానాల మధ్య ప్రయాణం మొదలుపెట్టిన లియోనల్ మెస్సీ.. చివరకు ఈ ఆటలో ఓ యోధుడిగా.. కోట్లాది మంది ఆరాధించే దేవుడిగా మారాడు. 2005లో మొదలైన ఆ ప్రయాణం కష్టాలు, కన్నీళ్లు, ఓటములు, బాధలు, విమర్శలు, నిష్క్రమణలు, పట్టు వదలని పోరాటాలతో చివరకు 2022లో ప్రపంచకప్‌ను ముద్దాడటంతో ఒక సంపూర్ణ మహాకావ్యంగా పూర్తయింది.

తెలంగాణకు ఇప్పుడు కావాల్సింది బంగారు తెలంగాణ కాదు బహుజన తెలంగాణ అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ సాధించుకుంటే జీవితాలు మారిపోతాయని భావించి ప్రజలకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు రావాల్సిన అవసరముందని ఆమె అన్నారు. సోమవారం నిజామామాబాద్ లో ఏర్పాటు చేసిన పాంచజన్య సంకల్ప సభలో కవిత ప్రసంగించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నాలుగిండ్లు మాత్రమే బంగారు మాయమయ్యాయని అన్నారు. సాధించుకున్న తెలంగాణలో అన్ని వర్గాలు బాగుపడాల్సిన అవసరముందని అందుకోసం సామాజిక న్యాయ తెలంగాణ అవసరమని చెప్పారు. తెలంగాణ ప్రజల కోసం 20 ఏళ్లు కష్టపడి పనిచేస్తే బీఆర్ఎస్ నుంచి నిర్దాక్షణ్యంగా వెళ్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను పదవుల కోసం పార్టీ పెట్టలేదని తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పు కోసం పంతం పట్టి పార్టీ పెట్టానని అన్నారు. పార్టీ ఏర్పాటు చేసిన 4 నెలల తర్వాత సొంతూరు నిజామాబాద్ కు రావటం సంతోషంగా ఉందని కవిత అన్నారు. గతంలో ఎంపీగా, ఎమ్మెల్సీ ఏ విధంగా ఆశీర్వాదం ఇచ్చారో ఇప్పుడు కూడా అదే ఆశీర్వాదం ఇవ్వాలని కవిత నిజామాబాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# నిజామాబాద్ గడ్డపై
# కవిత ఫైర్

- ప్రజల జీవితాల్లో మార్పులు తేవాలన్న సంకల్పంతో ముందుకు వచ్చా
- ఏ తప్పు చేయకుండానే జైల్లో పెట్టారు.. అప్పుడే నేను ఏ తప్పు చేయలేదని చెప్పా
- నాలుగేళ్ల ఈడీ, సీబీఐ ఇబ్బంది పెట్టినా ధైర్యం సడలలేదు.. దారి తప్పలేదు
- అమ్మ ఇంటివాళ్లు నిర్దాక్షణ్యంగా తరిమేస్తే అత్తింటి వాళ్లు కన్న బిడ్డలా అక్కున చేర్చుకున్నారు
- తండ్రి, కూతురును పాపిన ప్రశాంత్ రెడ్డిని జీవితంలో క్షమించను.. నా ఉసురు తగులుతుంది
- ఓ వైపు కాంగ్రెస్ పై పోరాటం చేస్తూనే టీఆర్ఎస్ నిర్మాణం చేస్తాం
- వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

**చట్టం, నిజామాబాద్**

తెలంగాణ సాధించుకున్న తర్వాత ప్రజల జీవితాల్లో అనుకున్న స్థాయిలో మార్పు రాలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. బంగారు తెలంగాణ అని చెప్పిన బీఆర్ఎస్ హయాంలో నలుగురి ఇండ్లు మాత్రమే బంగారం మాయం అయ్యాయని చెప్పారు. ప్రజల కోసం ఇంకా చేయాల్సింది చాలా ఉందన్నారు. బంగారు తెలంగాణ కాదు, ఇప్పుడు కావాల్సింది బహుజన తెలంగాణ అని కవిత అన్నారు. ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు రావాల్సి ఉందన్నారు. అందుకోసం చిత్తశుద్ధితో పనిచేసేందుకే తాను పార్టీ పెట్టానన్నారు. పదవుల కోసమైతే ఏ రాజకీయ పార్టీలోకైనా వెళ్లవచ్చని...కానీ తాను చూడని పదవులు లేవన్నారు. ప్రజల జీవితాల్లో మార్పు రావాలన్న పతంతోనే నేను పార్టీ పెట్టానన్నారు. పార్టీ ఏర్పాటు చేసిన 4 నెలల తర్వాత తన సొంతగడ్డ నిజామాబాద్ కు రావటం సంతోషంగా ఉందని చెప్పారు. సొంత గడ్డపై సొంత మనుషులను చూసి కవిత భావోద్వేగానికి లోనయ్యారు. ఎంత ఆపుకుందామనుకున్న కన్నీళ్లు ఆగటం లేదంటూ ఈ సందర్భంగా ఆమె అన్నారు. అలాగని తనను పిరికిదాన్ని అనుకోవద్దని... ఆడబిడ్డల గుండెల్లో బాధ ఉంటే కన్నీళ్లు వస్తాయని చెప్పారు. ఇక గతంలో ఎంపీగా, ఎమ్మెల్సీ గెలిపించి తనను ఎలా ఆశీర్వదించారో అదే విధంగా తనకు ఆశీర్వాదం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఏ తప్పు చేయకున్న సరే తీహార్ జైల్లో పెట్టినప్పటికీ ధైర్యం సడలలదేని, దారి తప్పలేదని కవిత గుర్తు చేసుకున్నారు. అప్పుడే తాను తప్పు చేయలేదని, నిజామాబాద్ నిప్పు బిడ్డనని చెప్పానని అన్నారు. ఈడీ, సీబీఐ తనను ఇబ్బంది పెట్టిన సమయంలో అండగా ఉండాల్సిన బీఆర్ఎస్ పార్టీ నిర్ధాక్షణ్యంగా తనను బయటకు పంపించిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పై కక్షతో తనను అరెస్ట్ చేశారని చెప్పిన బీఆర్ఎస్ పెద్దలు ఆ తర్వాత ఎందుకు మాట్లాడలేదని ఆమె ప్రశ్నించారు. బీఆర్ఎస్ నుంచి బయటకు పంపిన సరే తాను ప్రజల కోసం పనిచేయాలని నిర్ణయించుకున్నానని అందుకే పార్టీ పెట్టానని కవిత చెప్పారు.

### కాంగ్రెస్ పై పోరాటం.. టీఆర్ఎస్ నిర్మాణం

తెలంగాణ ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు కోసం ఐదు కీలకాంశాలతో తాము ముందుకు వెళ్తున్నట్లు కవిత చెప్పారు. పాంచజన్యం పేరుతో ఐదు కీలకాంశాలను ప్రాధాన్యంగా తీసుకున్నామన్నారు. ఉచిత విద్య, వైద్యం ప్రతి కుటుంబానికి ఇస్తామన్నారు. ఇందుకోసం డబ్బులు ఎక్కడివి అంటూ తప్పుడు ప్రచారాలు చేస్తారని...కానీ మన ఆదాయమే ఏటా 2 లక్షల కోట్లు ఉందని కవిత అన్నారు. అందులో లక్ష కోట్లు పెడితే ఉచిత విద్య, వైద్యం అందించవచ్చని చెప్పారు. బహుజన తెలంగాణ అంటే అన్ని కులాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని చెప్పారు. ఏ కులం వెనుకబడిన తెలంగాణ ముందుకు వెళ్లదని చెప్పారు. అగ్రవర్ణాల్లో పేదలు కూడా బాగుపడాలని కవిత అన్నారు. అందుకోసం ఓ వైపు కాంగ్రెస్ పార్టీతో పోరాటం చేస్తూనే మరోవైపు టీఆర్ఎస్ పార్టీని నిర్మాణం చేసుకుంటామన్నారు. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని కవిత స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లాలో ఐదు అసెంబ్లీ సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రేపటితో వెయ్యి రోజులైనప్పటికీ ఇప్పటికీ వాళ్లు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని కవిత విమర్శించారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన పార్టీని నిలదీయాలా వద్దా అని ప్రజలను ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఓట్లు పెట్టే ఈ ముఖ్యమంత్రి...గెలిచిన తర్వాత తిట్ల దండకం అందుకుంటారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ ప్రజల జీవితాలు ఆగమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.




### పదేళ్లలో బీఆర్ఎస్ ప్రజల సొమ్ము దోచుకుంది

బంగారు తెలంగాణ పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ అడ్డగోలుగా అవినీతికి పాల్పడిందని కవిత మండిపడ్డారు. పదేళ్లలో దోచుకున్న డబ్బులను బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికీ లెక్కపెడుతున్నారని చెప్పారు. ఆ డబ్బు అహంకారంతో టీఆర్ఎస్ పార్టీ నాయకులను బెదిరిస్తున్నారని కవిత మండిపడ్డారు. బెదిరిస్తే భయపడే రోజులు పోయాయని బీఆర్ఎస్ ను హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రధాన ప్రతిక్షంగా ప్రశ్నించాల్సిన బీఆర్ఎస్ ఎందుకు సైలెంట్ గా ఉందని కవిత ప్రశ్నించారు. అవినీతి కారణంగా కాంగ్రెస్ తో బీఆర్ఎస్ మిలాఖత్ అయ్యిందన్నారు. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే చూస్తే ప్రజలు సమస్యల్లో ఉన్నప్పటికీ ఒక్క బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఎందుకు ప్రజల కోసం పోరాటం చేయటం లేదో చెప్పాలన్నారు. జీవన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి అక్రమాలపై కాంగ్రెస్ ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని కవిత ప్రశ్నించారు. కాంగ్రెస్ తో బీఆర్ఎస్ కు ఉన్న అండర్ స్టాండింగ్ ఏంటో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ అవినీతిలో నాకు పాత్ర లేదా అని చాలా మంది ప్రశ్నిస్తారని కవిత అన్నారు. కానీ జీవన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి లు ఎమ్మెల్యేలు కాకముందు ఉన్న ఆస్తులు, ఆ తర్వాత వారి ఆస్తులను చూస్తే వారు ఎంత సంపాదించారో తెలుస్తుందన్నారు. తాను మాత్రం బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఉన్న కంపెనీ అమ్ముకున్నానని కవిత అన్నారు. పదేళ్లు దోచుకున్న బీఆర్ఎస్ నాయకులు మళ్లీ అధికారంలోకి వస్తామని చెబుతున్నారని....అలాంటి నాయకులను మళ్లీ గెలిపిద్దామా అని కవిత ప్రజలను ప్రశ్నించారు.

### నిజామాబాద్ ప్రజలే నా ధైర్యం

నిజామాబాద్ ప్రజలే నా ధైర్యమని కవిత చెప్పారు. తనను ఎంపీగా, ఎమ్మెల్సీగా ఇక్కడి ప్రజలు గెలిపించటంతోనే తాను ఎక్కడైనా ధైర్యంగా మాట్లాడగలిగానని అన్నారు. ఇదివరకు మాదిరిగానే ఇప్పుడు కూడా తనకు నిజామాబాద్ ప్రజల ఆశీర్వాదం కావాలని ఆమె కోరారు. తల్లి గారు కర్కశంగా బయటకు పంపిస్తే అత్తగారి కుటుంబమే తనను కన్న కూతురిగా ఆదరించిందని చెప్పారు. నిజామాబాద్ కోడలిగా తాను గర్వపడతానన్నారు. ఎంపీగా ఎమ్మెల్సీ ఉన్న సమయంలో ఈ ప్రాంతం అభివృద్ధి కోసం ఎంతో కష్టపడ్డానని చెప్పారు. బీడీ కార్మికులకు పోరాటం చేసి పెన్షన్ ఇప్పించానని కవిత గుర్తు చేశారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు ఎన్నో సార్లు కేసీఆర్ గారితో మాట్లాడినప్పటికీ ఆయన పట్టించుకోలేదని చెప్పారు. షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు 18 కోట్లు ఇవ్వాలని కోరితే కేటీఆర్ ఇవ్వలేదన్నారు. అయితే తన దోస్త్ కోరుట్ల ఎమ్మెల్యే కోసమే కేటీఆర్ ఈ షుగర్ ఫ్యాక్టరీ తెరవకుండా అడ్డుపడ్డాడని కవిత చెప్పారు. సారంగపూర్ లో షుగర్ ఫ్యాక్టరీ కోసం పోరాటం చేస్తున్న కార్మికులకు అండగా ఉంటామని కవిత చెప్పారు. నిజామాబాద్ లో ప్రజలకు ఏ కష్టమొచ్చినా సరే టీఆర్ఎస్ శ్రేణులు ముందుండి పోరాటం చేస్తాయన్నారు .

### ప్రశాంత్ రెడ్డిని జీవితంలో క్షమించను

నిజామాబాద్ జిల్లా నాయకుడు ప్రశాంత్ రెడ్డి పై కవిత తీవ్ర విమర్శలు చేశారు. తన తండ్రితో తనకు దూరం చేసిన వ్యక్తి ఆయనేనని అన్నారు. తండ్రి, కూతురును పాపిన వ్యక్తి ప్రశాంత్ రెడ్డేనని చెప్పారు. హరీష్ రావు, సంతోష్ రావు లను అయిన క్షమిస్తానేమో గానీ ప్రశాంత్ రెడ్డిని జీవితంలో క్షమించనని కవిత అన్నారు. తన ఉసురు కచ్చితంగా ఆయనకు తగులుతుందన్నారు. ప్రశాంత్ రెడ్డిని పెద్ద కొడుకులా చూసుకొని పిలిచి అన్నం పెట్టిన కేసీఆర్ కు అన్యాయం చేసే ప్రయత్నం చేశాడన్నారు. బీఆర్ఎస్ ఓడిపోయిన రెండో రోజే కాంగ్రెస్ లోకి వెళ్లే ప్రయత్నం చేశాడని చెప్పారు. ఆయను గెలిపించేందుకు తాను ఎంతో కష్టపడ్డానని, మంత్రి పదవి కూడా వచ్చిందని చెప్పారు. ఇంకా ఏం తక్కువైందని కాంగ్రెస్ లోకి వెళ్లే ప్రయత్నం చేశాడో చెప్పాలన్నారు. నిజామాబాద్ లో బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, జీవన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి లను నేను గెలిపిస్తే...నన్ను వాళ్లు ఓడించారంటూ కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

### అర్వింద్ పేరులోనే ధర్మం.
### ఆయనలో ఉందంతా అధర్మమే

నిజామాబాద్ ఎంపీ అర్వింద్ పేరులోనే ధర్మం ఉందని... ఆయనలో ఉందంతా అధర్మమే అని కవిత విమర్శించారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో మాధవ్ నగర్ బ్రిడ్జి పనులు పూర్తి కాలేదని విమర్శించిన అర్వింద్ ఇప్పుడేం చేస్తున్నారని ప్రశ్నించారు. అప్పుడు తాను కేకే ట్యాక్స్ వసూలు చేశానని మాట్లాడిన అర్వింద్ ఇప్పుడు ఏం ట్యాక్స్ వసూల్ చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రశ్నిస్తే అడ్డగోలుగా మాట్లాడే అర్వింద్...కేంద్రం నుంచి ఎన్ని పైసలు తెచ్చారో చెప్పాలన్నారు. పసుపు బోర్డు కారణంగా రైతులకు పైసా మేలు జరగలేదని కవిత విమర్శించారు.

# వరంగల్ కాంగ్రెస్‌లో
# ఇంటర్నల్ ఫైట్?



- పొంగులేటి టూర్‌లో కట్ అయిన కొండా సురేఖ పేరు
- ఫ్లెక్సీ, శిలాఫలకంలో మంత్రి ఫొటో, పేరు లేకపోవడం హాట్ టాపిక్
- వరంగల్ పాలిటిక్స్‌లో మరోసారి రగులుతున్న విభేదాలు

**చట్టం, వరంగల్:**

వరంగల్, ఆంధ్రప్రభ: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఫ్లెక్సీల వ్యవహారం మరోసారి రాజకీయ దుమారం రేపుతోంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారిక పర్యటనకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ, శిలాఫలకంలో మంత్రి కొండా సురేఖ ఫొటో, పేరు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లలో జిల్లా పరిధికి చెందిన మంత్రికి చోటు దక్కకపోవడంపై రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామం కాంగ్రెస్‌లో ఇప్పటికే కొనసాగుతున్న అంతర్గత రాజకీయ చర్చలకు మరింత ఆజ్యం పోసినట్లైంది.

**స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలోనూ..**

ఇటీవల మహబూబాబాద్ జిల్లా గూడూరులో జరిగిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన ఫ్లెక్సీలోనూ కొండా సురేఖ ఫొటో కనిపించకపోవడం చర్చకు దారితీసింది. తాజాగా కేసముద్రంలోనూ ఇదే తరహాలో ఫొటో, పేరు లేకపోవడంతో ఈ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. అయితే ఫ్లెక్సీల రూపకల్పనలో సురేఖ ఫొటో, పేరు ఎందుకు పొందుపరచలేదన్న దానిపై అధికారికంగా స్పష్టమైన వివరణ వెలువడాల్సి ఉంది.

**సురేఖ ఫొటో ఎందుకు లేదు?**

కేసముద్రం కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఏర్పాట్లలో కొండా సురేఖకు సంబంధించిన ఫొటో, పేరు కనిపించకపోవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. అధికారిక కార్యక్రమం కావడంతో ప్రొటోకాల్ ప్రకారం ఎవరెవరి పేర్లు, ఫొటోలు ఉండాలన్న అంశంపైనా చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారం ఉద్దేశపూర్వకమా? లేక కార్యక్రమం నిర్వహణలో భాగంగా జరిగిన పొరపాటా? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్‌లో ఇప్పటికే కొనసాగుతున్న విభేదాల నేపథ్యంలో ఈ పరిణామానికి రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది.

# టీ కాంగ్రెస్‌లో 'సెప్టెంబర్ సస్పెన్స్'



- హస్తినాకు తెలంగాణ నేతల పంచాయితీ
- ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి, మహేష్ గౌడ్
- కాంగ్రెస్ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారిన హైకమాండ్ పిలుపు
- కొండా, చిన్నారెడ్డిల వ్యవహారం, క్యాబినెట్ విస్తరణపై కీలక నిర్ణయాలకు ఛాన్స్!
- వెయ్యిరోజుల పాలనపై కూడా పార్టీ పెద్దలకు వివరించనున్న స్టేట్ లీడర్స్
- మహేశ్ కుమార్ గౌడ్‌కు క్యాబినెట్‌లో చోటు దక్కనుందా?
- 3న హైకమాండ్ నేతలతో భేటీ.. సెప్టెంబర్‌లో బిగ్ చేంజెస్ ఖాయామా?

**చట్టం, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. సురేఖపై పార్టీ క్రమశిక్షణ కమిటీ చేసిన సిఫారసులు ఇప్పటికే అధిష్ఠానం దృష్టికి వెళ్లిన నేపథ్యంలో.. సెప్టెంబర్ 3న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఢిల్లీకి వెళ్లనున్నారన్న వార్తలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ భేటీలో కొండా సురేఖ వ్యవహారంతో పాటు తెలంగాణ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపైనా చర్చ జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

**క్రమశిక్షణ కమిటీ సిఫారసు**

కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డికి సంబంధించిన వ్యవహారాలను టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ పరిశీలించింది. ఇద్దరి వివరణలను తీసుకున్న అనంతరం పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే వ్యవహారాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ సిఫారసు చేసినట్లు సమాచారం. సురేఖను మంత్రి పదవి నుంచి, చిన్నారెడ్డిని ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ పదవి నుంచి తప్పించే అవకాశం ఉందన్న ప్రచారం కూడా మొదలైంది. అయితే క్రమశిక్షణ కమిటీ సిఫారసు చేసినంత మాత్రాన తుది నిర్ణయం తీసుకున్నట్లు కాదని, దీనిపై ఏఐసీసీ స్థాయిలో నిర్ణయం రావాల్సి ఉందని కాంగ్రెస్ లోని మరోవర్గం చెబుతుంది.

**సెప్టెంబర్ 3న కీలక భేటీ**

కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి సెప్టెంబర్ 3న ఢిల్లీలో సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌లను పిలిచినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇంఛార్జీ కేసీ వేణుగోపాల్ సెప్టెంబర్ 1న ఢిల్లీకి తిరిగి వచ్చిన తర్వాత ఈ చర్చలు జరిగే అవకాశం ఉందని సమాచారం. ఈ సమావేశంలో కేవలం కొండా సురేఖ అంశమే కాకుండా.. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, శాఖల మార్పులు, ఖాళీగా ఉన్న మంత్రి పదవుల భర్తీ, పార్టీ వ్యవహారాలపై కూడా చర్చ జరిగే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**కేబినెట్‌లో మార్పులు ఉంటాయా?**

తెలంగాణ ప్రభుత్వం రెండున్నరేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో మంత్రివర్గంలో మార్పులు, శాఖల మార్పులపై కొంతకాలంగా ఊహాగానాలు కొనసాగుతున్నాయి. కొందరు మంత్రులకు శాఖలు మార్చడంతో పాటు, ఒకరిద్దరిని మంత్రివర్గం నుంచి తప్పించి కొత్తవారికి అవకాశం కల్పించే అవకాశం ఉందన్న ప్రచారం ఉంది. కొండా సురేఖను తప్పిస్తే ఆమె స్థానాన్ని భర్తీ చేసేందుకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశంపైనా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. అదే జరిగితే పీసీసీ అధ్యక్ష పదవికి కొత్త వ్యక్తిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఈ పదవికి బీసీ లేదా ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన నేతల పేర్లు కూడా చర్చలో ఉన్నట్లు తెలుస్తుంది.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యం 1000 రోజులు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.. వేములవాడ రూరల్, అర్బన్ మండలంలో నూతనంగా ఎంపికైన మండల, గ్రామ కాంగ్రెస్ కమిటీ సభ్యులను అభినందించారు... ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం భారీగా అప్పుల్లో కూరుకుపోయిందన్నారు.. ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు... మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రూ.20,650 కోట్ల రుణమాఫీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేశామని తెలిపారు. పేదలకు కొత్త రేషన్ కార్డులు అందించి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను నెరవేర్చే దిశగా



ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.. గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టిందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి దశలో 3,500, రెండో దశలో 2,000 ఇళ్లను మంజూరు చేసి పేదలకు ఇళ్ల నిర్మాణం చేపడుతోందన్నారు. ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రతిపక్షాలకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఉందని, అయితే అసత్య ప్రచారం చేసే హక్కు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఇచ్చే పిలుపులు, ప్రసంగాలను ప్రజలకు చేరేలా ప్రచారం చేయాలన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టేందుకు సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. గ్రామస్థాయిలో వచ్చే సమస్యలు, ప్రతిపక్షాల ప్రచారానికి సంబంధించి వాస్తవ సమాచారంతో సమాధానం ఇవ్వాలని, అవసరమైతే మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, తనను సంప్రదించి సరైన సమాచారాన్ని తీసుకొని ప్రజలకు వివరించాలని తెలిపారు. తెలంగాణలో చేపడుతున్న కులగణన వంటి కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా ముందుకు సాగుతోందన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మండల, జిల్లా, గ్రామ కమిటీ నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కోసం గతంలో పనిచేసిన నాయకులు, కార్యకర్తల సేవలను అభినందించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించాలని సూచించారు. ప్రతి గ్రామ నాయకుడు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ వేదికల్లో చురుకుగా ఉండాలని కోరారు.

## ప్రభుత్వ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలి

- సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



**చట్టం ఇందూరు :** ప్రభుత్వాసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్ లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీఎంఆర్ఎఫ్ నిధులను కేవలం 20 శాతం మాత్రమే చెల్లిస్తున్నారని, వీటిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్న పేదలు తమ కార్యాలయంలో సంప్రదిస్తే ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేస్తామన్నారు. ఉత్తమ చికిత్స అందేలా చూస్తామన్నారు. అలాగే హైదరాబాదులోని బీబీనగర్ లో గల ఏయిమ్స్ లో అత్యాధునిక వైద్య సేవలు ఉన్నాయని గుర్తు చేశారు. అలాగే నిమ్స్ లో చికిత్స పొందే వారికి తన ద్వారా ఎల్ఓసి అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కూడా రెండు టిమ్స్ ఆసుపత్రులు నిర్మించారన్నారు. వారి సేవలను కూడా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు మఠం పవన్, రాజేందర్, విజయ మల్లేష్ యాదవ్, కల్పే అర్చనా చిరంజీవి, సీనియర్ నాయకులు ఇప్పకాయల కిషోర్, మాస్టర్ శంకర్, స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అరెకటిక సంక్షేమ సంఘం భవనానికి భూమిపూజ చేసిన విప్ ఆది శ్రీనివాస్



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వేములవాడ పట్టణంలో నూతనంగా నిర్మించనున్న వేములవాడ మండల అరెకటిక సంక్షేమ సంఘం భవన నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ అరెకటిక సంక్షేమ సంఘం అభివృద్ధితో పాటు సంఘం సభ్యుల సంక్షేమానికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సంఘ భవనం నిర్మాణం పూర్తయితే సభ్యుల సమావేశాలు, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కౌన్సిలర్లు తోట రాజు, శేఖర్, శ్రీనివాస్, తుమ్ మధు, నాయకులు కూరగాయల కొమురయ్య, ప్రసాద్, బుట్టి రమేష్, కొలకని రాజు, మల్లేశం, విష్ణు, సిరిగిరి శ్రీకాంత్, గుమ్మడి రాజేష్ గౌడ్, దూలం భూమేష్, అరెకటిక సంక్షేమ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ పై కోఆర్డినేషన్ మీటింగ్



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని కోర్ట్ ప్రాంగణంలో సెప్టెంబర్ నెలలో నిర్వహించే లోక్ అదాలత్ పై కోఆర్డినేషన్ మీటింగ్ జూనియర్ సివిల్ జడ్జి సరళ రాణి, అధ్యక్షతన సోమవారం రోజు నిర్వహించారు. ఈ సమావేశంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి భవ్యశ్రీ, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గట్టు గంగాధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ నెలలో నిర్వహించే లోక్ అదాలత్ పై జూనియర్ సివిల్ జడ్జి సరళ రాణి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కుదురుపాక ప్రవీణ్ చందర్, జనరల్ సెక్రటరీ పోడేటి శంకర్, ట్రెజరర్ వద్నాల రాజేందర్, న్యాయవాదులు ఆవరి రమేష్, గణేష్, సుభాష్, రాజేశ్వర్, భీంగల్ పట్టణ సీఐ సత్యనారయణ, ఆర్మూర్ డివిజన్ ఎస్ఐ లు తిరుపతి, రాము, సంజీవ్, యాసిర్ అరఫాత్, సుహాసిని కోర్ట్ కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

## సట్లపూర్ తండాలో SIR 2వ విడత సమావేశం

- ఓటు హక్కుపై అవగాహన కల్పించిన సర్పంచ్



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని మాక్లూర్ మండల పరిధిలోని సట్లపూర్ తండా గ్రామంలో సోమవారం రోజు SIR 2వ విడత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొత్తగా ఓటు హక్కు కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడమే కాకుండా, ఎన్నికల్లో తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మాక్లూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వినోద, జీపీఓ గంగారం, ఉపసర్పంచ్ మహిపాల్, కరోబర్, వార్డు సభ్యులు, వివిధ మండల స్థాయి అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మందమర్రి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి

- సమస్యల పరిష్కారానికి అధికారుల ప్రత్యేక చొరవ



**చట్టం రామకృష్ణాపూర్ (మందమర్రి) :** ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు చొరవ చూపాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి 7 దరఖాస్తులు అందాయి. ఎంపీడీవో రాజేశ్వర్ స్వయంగా వినతులను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు వాటిని పంపించారు. అందిన దరఖాస్తుల్లో ఐదు రెవెన్యూ శాఖకు సంబంధించినవి కావడంతో తహసీల్దార్ సతీష్‌కు పంపించారు. మరో రెండు వినతులు మందమర్రి మున్సిపాలిటీకి సంబంధించినవి కావడంతో మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడానికి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అందిన ప్రతి అర్జీని నిర్లక్ష్యం చేయకుండా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపర్డెంట్ వేణు, మందమర్రి ఎస్సై గోపతి నరేష్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధుల గుట్ట పైన శ్రావణ మాస శోభ



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన శ్రీ నవనాథ సిద్ధుల గుట్ట పైన శ్రావణ మాసం మూడవ సోమవారం భక్తులు ఉదయం నుండి అధిక సంఖ్యలు విచ్చేసి నవనాథ సిద్దేశ్వరునికి పంచామృతాలతో బిల్వపత్రాలతో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు రామాలయం, దత్తాత్రేయ స్వామి, దుర్గామాత, అయ్యప్ప స్వామి, ఎల్లమ్మ తల్లి ఆలయంలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనందీశ్వర మహారాజు ఆధ్వర్యంలో ఘనంగా సిద్దేశ్వరుని పల్లకి సేవ, భజన పాటలు భక్తి గీతాలు పడుతూ నృత్యాలు చేసుకుంటూ భక్తితో పల్లకి సేవా నిర్వహించారు. అనంతరరం విచ్చేసిన భక్తులందరికీ అన్నదాతలు అంకాపూర్ గ్రామానికి చెందిన శృంగారం స్వాతి గంగాధర్, కుటుంబ సభ్యులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదం భక్తులందరికీ అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.సుమన్, పిసీ.గంగారెడ్డి, చరణ్ రెడ్డి, కోడిగిల మల్లయ్య, జిమ్మీ రవి, కొంతం మంజుల మురళి, బట్టు శంకర్, చందేసి శ్రీనివాస్, నరేష్, ప్రశాంత్ గౌడ్, రామ గౌడ్, సిద్ధుల గుట్ట సేవా సమితి భక్తులందరూ పాల్గొన్నారు.

## డాక్యుమెంట్లు పోగొట్టుకున్న బాధితుడు

**చట్టం : బీబీ పేట్ :** బీబీపేట్ మండల కేంద్రానికి చెందిన ఎర్రం ప్రసాద్ తన విలువైన స్థలం క్రయ విక్రయానికి సంబంధించిన డాక్యుమెంట్లు పోగొట్టుకున్నట్లు ఆందోళన చెందుతూ తెలిపారు. ఇటీవల తను హైదరాబాద్ నుండి కామారెడ్డి వరకు ప్రయాణిస్తున్న బస్సులో పోగొట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. ఎవరికైనా పోగొట్టుకున్న డాక్యుమెంట్లు దొరికితే తమకు అందజేయాలని, 91777 88997 నెంబరును సంప్రదించాలని కోరారు. అందజేసిన వారికి తగిన పారితోషికం ఇవ్వనున్నట్టు తెలిపారు.

## ఒంటరి మహిళలే టార్గెట్.. మాటలతో మాయ చేసి బంగారం చోరీ




- అంతర్‌రాష్ట్ర నిందితురాలి అరెస్ట్
- తాండూరులో 5, కర్ణాటకలో 3 కేసులు ఛేదింపు
- 24 తులాల బంగారు ఆభరణాల దొంగతనాల్లో ప్రమేయం
- సాంకేతిక ఆధారాలతో నిందితురాలి కదలికలు గుర్తించిన CCS పోలీసులు

**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** ఒంటరిగా నివసించే వితంతు మహిళలు, వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని పరిచయం పెంచుకోవడం, మాటల్లోకి దించడం, దృష్టి మరల్చి బంగారు ఆభరణాలను అపహరించడం వంటి నేరాలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర నిందితురాలిని వికారాబాద్ CCS పోలీసులు అరెస్ట్ చేశారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాలతో తాండూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా నమోదైన దొంగతనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కేసుల దర్యాప్తు బాధ్యతలను CCS ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ చేపట్టారు.

**సాంకేతిక ఆధారాలతో నిందితురాలి గుర్తింపు**

నేరాలు జరిగిన ప్రాంతాలు, బాధితుల వివరాలు, నిందితురాలి కదలికలు, నేరం జరిగిన విధానం, సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన ప్రత్యేక పోలీస్ బృందం నిందితురాలిని గుర్తించి అదుపులోకి తీసుకుంది. విచారణలో తాండూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఐదు కేసుల్లో నిందితురాలి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసుల్లో సుమారు 9.5 తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు వెల్లడైంది.

**కర్ణాటకలో మరో మూడు కేసులు**

దర్యాప్తులో భాగంగా కర్ణాటక రాష్ట్రంలోని గదగ్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కేసులు, నవనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసులోనూ ఇదే తరహా నేరాలకు నిందితురాలు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మూడు కేసుల్లో కలిపి సుమారు 14.5 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. తాండూరులో 9.5 తులాలు, కర్ణాటకలో 14.5 తులాలు కలిపి మొత్తం 24 తులాల బంగారు ఆభరణాల దొంగతనాల్లో నిందితురాలి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**మాటలతో మాయ.. ఆభరణాలతో పరార్**

నిందితురాలు ప్రధానంగా ఒంటరిగా నివసించే వితంతు మహిళలు, వృద్ధ మహిళలను గుర్తించి వారితో పరిచయం పెంచుకునేది. వివిధ విషయాలపై మాట్లాడుతూ వారి దృష్టిని మరల్చి, వారు ధరించిన బంగారు గొలుసులు, నెక్లెస్‌లు, గాజులు ఇతర ఆభరణాలను అపహరించేది. ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా ఇతర రాష్ట్రాలకు వెళ్లి కూడా ఇదే తరహాలో నేరాలకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

**గతంలోనూ పలు క్రిమినల్ కేసులు**

నిందితురాలి నేర చరిత్రను పరిశీలించిన పోలీసులు మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా MIDC పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు కేసులు, బర్షి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు, హైదరాబాద్ సిటీ మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో కేసు నమోదైనట్లు గుర్తించారు.

**అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: బల్వంత్ రాయ్**

CCS ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ మాట్లాడుతూ ఒంటరిగా నివసించే వితంతు మహిళలు, వృద్ధులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా దృష్టి మరల్చే ప్రయత్నం చేసినా, అనుమానాస్పదంగా ప్రవర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. విలువైన బంగారు ఆభరణాలతో ఒంటరిగా బయటకు వెళ్లే సమయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అపరిచితుల మాటలను నమ్మి వారి వెంట వెళ్లకూడదని, వ్యక్తిగత వివరాలను వెల్లడించకూడదని సూచించారు.

**పోలీస్ బృందానికి అభినందనలు**

కేసుల దర్యాప్తును CCS ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, తాండూరు టౌన్ SI మమత ఆధ్వర్యంలో HCలు జయవర్ధన్, శివకుమార్, PCలు రామకృష్ణ, సాయప్ప, శివరాజ్, పాండు, రాజు, రవీందర్, WPC గాయత్రి సమన్వయంతో నిర్వహించారు. ఎనిమిది కేసులను సమర్థవంతంగా ఛేదించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా అభినందించారు.

## రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ కక్షపూరిత కుట్ర

- టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ
- మహేష్ కుమార్ గౌడ్



**చట్టం నిజామాబాద్ ప్రతినిధి :** దళితులపై జరుగుతున్న వివక్ష, అంటరానితనం, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా గళం వినిపించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం బీజేపీ కక్షపూరిత రాజకీయ కుట్రకు నిదర్శనమని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఎదుర్కొన్న అవమానకర పరిస్థితులపై రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే.. సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ప్రశ్నించిన రాహుల్ గాంధీపైనే కేసులు నమోదు చేయడం దురదృష్టకరమని అన్నారు. దళితులపై వివక్ష, అంటరానితనాన్ని ప్రశ్నించడం నేరమా అని ఆయన ప్రశ్నించారు. అన్యాయాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడం ద్వారా అంటరానితనం, కుల వివక్షను నిర్మూలించలేరని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బాధితుల పక్షాన నిలబడాల్సిన ప్రభుత్వం.. అన్యాయాన్ని ప్రశ్నించిన వారినే నిందితులుగా చిత్రీకరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. అంటరానితనాన్ని రాజ్యాంగం ద్వారా నిర్మూలించడం నుంచి ఎస్సీ, ఎస్టీలపై అఘాయిత్యాలను నిరోధించేందుకు ప్రత్యేక చట్టాల రూపకల్పన వరకు సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ చారిత్రకంగా పోరాడిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. దళితులపై వివక్షను నిర్మూలించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటివరకు తీసుకున్న నిర్దిష్ట చర్యలేమిటో దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అంటరానితనం నిర్మూలన కోసం ఆర్ఎస్ఎస్ చేపట్టిన ఉద్యమాలు, చేసిన పోరాటాలేమిటో కూడా ప్రజలకు వివరించాలని సవాల్ చేశారు. బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలైన సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. దళితుల హక్కులు, ఆత్మగౌరవం కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. కుల వివక్ష, అంటరానితనం, సామాజిక అన్యాయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాటం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్లపై ప్రజావాణిలో ఫిర్యాదు



**చట్టం రామాయంపేట :** మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 13 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో తెలిపారు. వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి ఐదు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి మూడు, విద్యుత్ శాఖకు రెండు, నీటిపారుదల శాఖకు ఒక ఫిర్యాదు వచ్చినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఝాన్సీ లింగాపూర్‌కు చెందిన తుడుం నాగయ్య తండ్రి లక్ష్మయ్య ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అక్రమాలు జరుగుతున్నాయని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఇప్పటికే సొంత ఇళ్లు ఉన్న కొందరికి మరోసారి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని ఆరోపించారు. గ్రామంలో ఇలాంటి లబ్ధిదారులు మరికొందరు ఉన్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై గ్రామస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి నిజానిజాలను వెలికితీయాలని కోరారు. ఇప్పటికే ఇళ్లు ఉన్న వారికి మంజూరైన ఇళ్లను నిలుపుదల చేసి, సొంత ఇల్లు లేని నిరుపేదలు, గుడిసెల్లో నివసిస్తున్న అర్హులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల సమక్షంలో అర్హులను గుర్తించి న్యాయం చేయాలని కోరుతూ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు.

## బస్సు ఆపకపోవడంతో ప్రయాణికుడికి తీవ్ర గాయాలు



**చట్టం న్యూస్, వేములవాడ రూరల్ :** వేములవాడ రూరల్ గుర్రవానిపల్లి స్టేజి వద్ద బస్సు పూర్తిగా ఆపకపోవడంతో దిగేందుకు ప్రయత్నించిన కొల్లూరి రామచంద్రన్ అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో తలకు గాయాలతో పాటు చేయి విరిగింది. తోటి ప్రయాణికులు, స్థానికులు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించి సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఈ స్టేజి వద్ద బస్సులు సరిగా ఆపడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులు పూర్తిగా ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఘటనపై పోలీసులు బస్సు డ్రైవర్, కండక్టర్ వివరాలు సేకరించి ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు.

## రామకోటి సంస్థ ఆధ్వర్యంలో అభిషేకాలు

- శివానుగ్రహంతో సమాజంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలి
- భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు



**చట్టం సిద్దిపేట (దుబ్బాక) :** శ్రావణమాసాన్ని పురస్కరించుకుని సోమవారం అద్దాల మందిరం వద్ద శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ ఆధ్వర్యంలో మహాశివునికి పంచామృత విశేష అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు దంపతులు ఓం నమః శివాయ నామస్మరణతో ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ శివభక్తి కేవలం ఆచారం కాదని, ఆధ్యాత్మిక చైతన్యానికి నాంది అని అన్నారు. శ్రావణమాసంలో పరమశివుని ఆరాధించడం ఎంతో పవిత్రమైనదని, శివనామస్మరణతో మనసుకు ప్రశాంతత, జీవితానికి ఆధ్యాత్మిక బలం చేకూరుతాయని తెలిపారు. సమాజంలో భక్తి, ధర్మం మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

## SIR నోటీసులు చూసి ఓటర్లు ఆందోళన చెందవద్దు

- భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు



**చట్టం సిద్దిపేట (దుబ్బాక) :** SIR ప్రక్రియలో నోటీసులు అందుతున్నా ఓటర్లు భయపడాల్సిన అవసరం లేదని భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహిత రామకోటి రామరాజు అన్నారు. తనకు కూడా నోటీసు వచ్చిందని, అవసరమైన పత్రాలను సోమవారం నాడు BLO కల్పన కు అందజేసి వివరాలను ధృవీకరించుకున్నానని తెలిపారు. కొన్ని వివరాల్లో అక్షర దోషాలు, చిన్నపాటి పొరపాట్ల వల్ల నోటీసులు వచ్చి ఉండవచ్చని పేర్కొన్నారు. నోటీసు రావడం అంటే ఓటు హక్కు కోల్పోయినట్లు కాదని స్పష్టం చేశారు. నోటీసులు అందుకున్న ఓటర్లు భయపడకుండా సరైన ఆధారాలు, ధ్రువపత్రాలను సంబంధిత BLOలకు సమర్పించి వివరాలను ధృవీకరించుకోవాలని సూచించారు.

## అర్హులైన నిరుపేదలకే డబుల్ బెడ్ రూమ్ లు ఇవ్వాలి

- **సిపిఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి డిమాండ్**




**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు సిపిఎం ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రోజు ధర్నా నిర్వహించారు. అనంతరం సిపిఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్యలు మాట్లాడుతూ, గత 30 సంవత్సరాలుగా ఆర్మూర్ పట్టణంలో నిరుపేదలు ఇల్లు లేక ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నప్పటికీ గత 30 సంవత్సరాలుగా ఏ ప్రభుత్వం కూడా ఇల్లు ఇచ్చినటువంటి పరిస్థితి లేదని అన్నారు. దరఖాస్తు చేసినప్పుడు జిరాక్స్ లకి వందలాది రూపాయలు ఖర్చవుతున్నాయి కానీ నిరుపేదలకు ప్రయోజనం ఏమి లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్మూర్ పట్టణంలో నిరుపేదలను గుర్తించి అర్హులైనటువంటి వారికి ఎలాంటి అవగతం లేకుండా డబుల్ బెడ్ రూమ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ రాని నిరుపేదలందరికీ కూడా ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చి పది లక్షల లోను మంజూరు చేసి ఇవ్వాలని, అలాగే ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న వాళ్ళందరికీ కూడా పట్టాలు ఇవ్వాలని మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చినటువంటి వాగ్దానాలు పేదలకి వృద్ధులకు పెన్షన్ పెంచుతామని 4000 పెంచలేదని అన్నారు. కొత్తగా దరఖాస్తులు తీసుకున్నారు తప్ప ఎప్పటి నుంచి ఇస్తామనేటటువంటిది ఇంకా కాలయాపన చేయటం తగదని తక్షణమే దరఖాస్తుల తీసుకున్న వాళ్ళందరికీ కూడా పెన్షన్ మంజూరు చేసి ఇవ్వాలని, అట్లాగే వికలాంగులకు 6000 పెన్షన్ పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని యెడల భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఆర్మూర్ డివిజన్ నాయకులు భూమన్న, రవి, నగేష్ గౌడ్, సాయిలు, అమీర్ ఖాన్, షాహిదా బేగం, కల్లుబాయి, విట్టల్, రాదా, లక్ష్మి, పద్మ, సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

## సెల్ ఫోన్లు అప్పగింత



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో పోయినటువంటి మొబైల్ ఫోన్లను సిఈఐఆర్ పోర్టల్ ద్వారా సేకరించి బాధితులు ఏడు మందికి 01.హైమత్ అలీ, 02.వెంకటా కృష్ణ, 03.మహమ్మద్ హైముద్దీన్, 04.గుమ్మిరియాల శ్రీకర్, 05 నేరడి లింగారెడ్డి, 06.రాజేష్, 07 రమేష్ లకు మొబైల్ ఫోన్ లను అప్పగించబడినదని స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇందులో భాగంగా మూడు సంవత్సర క్రితం రెండు మొబైల్స్, ఒక సంవత్సరం లోపు ఐదు మొబైల్స్ లు ఇచ్చినట్లు తెలిపారు.

## విద్యార్థులకు పోలీసుల అవగాహన సదస్సు

- **డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు హెచ్చరిక**



**చట్టం ఆర్మూర్:** మన ఊరు మన భద్రత మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని కృష్ణవేణి హై స్కూల్ లో సోమవారం రోజు విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్మూర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ సత్యనారాయణ గౌడ్, ఆధ్వర్యంలో అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ముఖ్యంగా నాలుగు అంశాలపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. మత్తు పదార్థాల నిర్మూలన, డ్రగ్స్, గంజాయి వంటి వ్యసనాలకు యువత బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని, మత్తు పదార్థాల రవాణా లేదా వినియోగం కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాలపై జాగ్రత్తలు తీసుకోవాలని ఆన్లైన్ మోసాలు, అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, ఓటీపీ (OTP) షేరింగ్, సోషల్ మీడియా వాడకంలో విద్యార్థిని విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నియమాల పాలన చేయాలని మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

**షీ టీమ్స్ (SHE Teams) రక్షణ:**

బాలికలు, మహిళల రక్షణ కోసం తెలంగాణ పోలీసులు అందిస్తున్న 'షీ టీమ్స్' సేవలను వివరించారు. వేధింపులకు గురైతే భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, పోలీస్ సిబ్బంది, షి టీం సభ్యులు విఘ్నేష్, పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 14 దరఖాస్తులు

- **ఎంపీడీవో గోపాలకృష్ణ**




**చట్టం బిచ్కుంద ;** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 14 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో గోపాలకృష్ణ తెలిపారు.

**వచ్చిన దరఖాస్తుల వివరాలు:**

MRO కార్యాలయానికి సంబంధించినవి 4
ఎలక్ట్రిసిటీకి సంబంధించినవి 1
మున్సిపాలిటీ,2
MPDO 2
.పంచాయతీరాజ్ ఏఈ5

మొత్తం 14 దరఖాస్తులు వచ్చాయని, ఆయా శాఖలకు పంపిస్తామని, 30 రోజుల్లో ఆ పనులను పూర్తి చేయాల్సి వస్తది అని ఎంపీడీవో గోపాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, తాసిల్దార్ సిబ్బంది ఐకెపి ఆప్కారి ఎస్సై మున్సిపాలిటీ కస్తూర్బా గాంధీ బీసీ హాస్టల్ సిబ్బంది తదితర అధికారులు పాల్గొన్నారు.

## సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణం.. వెంటనే ఆపాలి



**చట్టం, తూప్రాన్;** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో నిబంధనలకు విరుద్ధంగా, సెట్ బ్యాక్ లేకుండా నిర్మిస్తున్న రెడ్డి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొల్లెబోయిన మహేష్ యాదవ్ డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెడ్డి సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘిస్తూ చేపడుతున్నారని ఆరోపించారు. సెట్ బ్యాక్ నిబంధనలు పాటించకుండా నిర్మాణం కొనసాగుతున్న విషయాన్ని తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ స్పందించకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ నిర్మాణ పనులు యథేచ్ఛగా కొనసాగుతుండడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేసి, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాన్ని పరిశీలించి, సంబంధిత వారికి వెంటనే నోటీసులు జారీ చేయాలని కోరినట్లు తెలిపారు. సెట్ బ్యాక్ లేకుండా కొనసాగుతున్న నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్లాస్టిక్‌పై మున్సిపల్ అధికారుల దాడులు



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పలు దుకాణాలపై సోమవారం రోజు జిల్లా కలెక్టర్, మున్సిపల్ చైర్పర్సన్ గోనె లహరి రఘు, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, ల ఆదేశాల మేరకు సింగిల్ యూస్ ప్లాస్టిక్ పై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను గుర్తించి, వాటిని సీజ్ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై భారీ జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్, కమిషనర్, మాట్లాడుతూ ఆర్మూర్ పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. వ్యాపారులు నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించకుండా, విక్రయించకుండా మున్సిపల్ అధికారులకు సహకరించాలని సూచించారు. ప్రజలు కూడా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ ప్లాస్టిక్ తనిఖీలలో సానిటరీ సూపర్వైజర్ నరేందర్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, మున్సిపల్ సిబ్బంది సంతోష్, రాము, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గైని గంగారాం పదవీ విరమణ మహోత్సవం

- **హాజరై సన్మానించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**
- **ప్రభుత్వ సేవలో గంగారాం అందించిన సేవలు అభినందనీయం**



**చట్టం, నిజామాబాద్:** నిజామాబాద్‌లోని ఎస్ఆర్ఎస్పీ పోచంపాడ్ డ్యామ్‌సైట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన గైని గంగారాం పదవీ విరమణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉద్యోగ జీవితం పూర్తి చేసుకొని పదవీ విరమణ పొందిన సందర్భంగా అధికారులు, సహోద్యోగులు, కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ఆయనకు ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదవీ విరమణ పొందిన గైని గంగారాన్ని శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయనకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం అనేది కేవలం ఒక విధి మాత్రమే కాదని, ప్రజలకు సేవ చేసే గొప్ప బాధ్యత అని పేర్కొన్నారు. ఆ బాధ్యతను గైని గంగారాం సుదీర్ఘకాలం సమర్థవంతంగా నిర్వర్తించడం అభినందనీయమన్నారు. ఉద్యోగ జీవితంలో క్రమశిక్షణ, నిబద్ధత, బాధ్యతాయుతమైన పనితీరుతో సహోద్యోగుల ఆదరాభిమానాలు పొందడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. ఎస్ఆర్ఎస్పీ పరిధిలోని డ్యామ్‌సైట్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ కార్యాలయ పరిపాలనలో తనదైన ముద్ర వేసిన గైని గంగారాం సేవలను ఈ సందర్భంగా పలువురు అధికారులు గుర్తుచేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమయపాలనతో, అంకితభావంతో నిర్వర్తిస్తూ ఉద్యోగుల మధ్య మంచి గుర్తింపు సంపాదించుకున్నారని కొనియాడారు. ప్రభుత్వ సేవలో ఎన్నో సంవత్సరాలు పనిచేసి పదవీ విరమణ పొందడం ప్రతి ఉద్యోగి జీవితంలో ఒక ప్రత్యేక ఘట్టమని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఉద్యోగ జీవితం ముగిసినప్పటికీ సమాజంతో ఉన్న అనుబంధం కొనసాగాలని, తన అనుభవాన్ని భవిష్యత్ తరాలకు అందించాలని సూచించారు. గైని గంగారాం భవిష్యత్ జీవితం ఆనందంగా సాగాలని, కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు మాట్లాడుతూ గైని గంగారంతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. విధి నిర్వహణలో ఆయన చూపిన నిబద్ధత, సహోద్యోగులతో కలిసిమెలిసి పనిచేసే తీరు, సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించే విధానం అందరికీ ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యాలయంలో సీనియర్ ఉద్యోగిగా సహచరులకు మార్గదర్శకంగా నిలిచారని తెలిపారు. తన పదవీ విరమణ సందర్భంగా సహోద్యోగులు, అధికారులు, కుటుంబ సభ్యులు చూపిన ప్రేమాభిమానాలకు గైని గంగారాం కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ జీవితంలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరినీ ఎప్పటికీ గుర్తుంచుకుంటానని పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా కొనసాగిన ఉద్యోగ జీవితానికి ముగింపు పలకడం భావోద్వేగభరితమైన క్షణమని అన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు కూడా గైని గంగారాం ఉద్యోగ జీవితంలోని అనుభవాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ప్రభుత్వ సేవలో ఆయన చేసిన కృషి తమ కుటుంబానికి గర్వకారణమని తెలిపారు. కార్యక్రమం ఆద్యంతం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని గైని గంగారానికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనతో కలిసి జ్ఞాపకార్థంగా ఫోటోలు దిగారు.

## సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతోపై చదువులకు దూరమవుతున్నాం

- **స్నేహ కాలేజీ విద్యార్థుల ఆవేదన**



**చట్టం రామాయంపేట :** మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని స్నేహ కాలేజీలో చదువుకున్న పలువురు విద్యార్థులు తమ విద్యా సర్టిఫికెట్లు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో జాప్యం జరుగుతుండటంతో కాలేజీ యాజమాన్యం తమ సర్టిఫికెట్లను ఇవ్వడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యంగా వస్తుండటంతో ఆ ప్రభావం నేరుగా విద్యార్థుల భవిష్యత్తుపై పడుతోందని వారు వాపోతున్నారు. సర్టిఫికెట్లు అందకపోవడంతో ఉన్నత చదువులకు దరఖాస్తు చేసుకోవడం, ఉద్యోగ అవకాశాలకు అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించడం కష్టంగా మారిందని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. కాలేజీ కరస్పాండెంట్ వలిశెట్టి సత్యనారాయణ ఫీజుల విషయంలో ఒత్తిడి తెస్తూ సర్టిఫికెట్లు నిలిపివేస్తున్నారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నప్పటికీ, తమపై భారం మోపడం సమంజసం కాదని వారు అంటున్నారు.సర్టిఫికెట్లు అందక కొందరు విద్యార్థులు ఉన్నత విద్య అవకాశాలు, ఉద్యోగ నియామక ప్రక్రియల్లో వెనుకబడుతున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు. అదే సమయంలో విద్యార్థుల విద్యా సర్టిఫికెట్ల విషయంలో సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## డబుల్ బెడ్‌రూం సమస్యల పరిష్కారమే లక్ష్యం

- **అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన వోడ్నాల శ్రీనివాస్**



**చట్టం రామకృష్ణాపూర్:** డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని పాత పోలీస్ స్టేషన్ ప్రాంతంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాన్ని సోమవారం గృహ నిర్మాణ శాఖ ఏఈ సాయిరామ్, మున్సిపల్ ఏఈ అశ్రిత్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఇటీవల డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాన్ని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ నాయకులతో సందర్శించిన వోడ్నాల శ్రీనివాస్...అక్కడి లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో కలిసి మరోసారి కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కాలనీలో అంతర్గత సీసీ రోడ్ల పరిస్థితిని మెరుగుపరచాలని, డ్రైనేజీ వ్యవస్థను పరిశుభ్రపరచాలని కోరారు. అలాగే ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని, దెబ్బతిన్న సింటెక్స్ ట్యాంకుల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సెప్టిక్ ట్యాంకులపై మూతలు ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి ఇంటికీ నల్లా ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. లబ్ధిదారుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన వోడ్నాల శ్రీనివాస్...వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాలనీవాసులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కోరారు. లబ్ధిదారులకు ఇచ్చిన హామీల అమలుకు తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు దండు సదానందం, బిసా శ్రీనివాస్, బండారి సత్యనారాయణ, ఎలకటూరి నరేష్, అనంతుల రవి, చాంద్ పాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగుల రాజ్ కుమార్, బొడ్డుల ప్రేమ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపిన కాపు సంఘము రైతు ప్రతినిధులు



**చట్టం ఆర్మూర్:** గత కొన్ని నెలలుగా ఆర్మూర్ పట్టణంలో యూరియా యాప్ డౌన్లోడ్ కాకపోవడం, డౌన్లోడ్ అయితే యూరియా బుక్ కాకపోవడం వల్ల రైతులు చాలా ఇబ్బంది పడ్డారు. ఇదే విషయాన్ని ప్రజావాణిలో, సబ్ కలెక్టర్, తహశీల్దార్, మండల వ్యవసాయ అధికారులకు వినతి పత్రాలతో వివవించిన రైతు సంఘాల ప్రతినిధులు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, దృష్టికి ఆర్మూర్ ఆరు పంథాల రైతు సంఘం ప్రతినిధులు ఈ యాప్ గురించి తీసుకెళ్లగా వారు వెను వెంటనే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, తో మాట్లాడి యాప్ డౌన్లోడ్ అయ్యే విధంగా యూరియా బుక్ అయ్యే విధంగా చూడడం జరిగిందనీ పట్టణ రైతులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, కి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, కి జిల్లా కలెక్టర్ కు సంబంధిత వ్యవసాయ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన ఆర్మూర్ పట్టణ రైతు సంఘం ప్రతినిధులు. ఈ సందర్భంగా రైతు ప్రతినిధి కలిగొట గంగాధర్, మాట్లాడుతూ ఆర్మూర్ ఎమ్మెల్యే రైతు పక్షపతి అని, అర్బన్ రైతు ప్రతినిధులు తన దృష్టికి యూరియా పరిష్కారం చేయలని చెప్పగానే పరిష్కారం చూపడం చాలా అభినందనీయమన్నారు. ఈ సమయంలో మొక్కజొన్నకు, వరికి యూరియా చాలా అవసరమని యూరియా వాడకుంటే దిగుబడి చాలా తగ్గేదని సరియైన సమయంలో కార్బన్ రైతులకు యూరియా పరిష్కారం చేయడం జరిగింది అని అన్నారు. గతంలో కూడా రైతులకు వడ్ల కొనుగోలు విషయంలో సంబంధిత అధికారులకు మాట్లాడి వెంటనే కొనుగోలు అయ్యే విధంగా చూశారని, ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి రైతు పక్షపతి అని అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర్ రావు, కి జిల్లా కలెక్టర్ కి జిల్లా, మండల వ్యవసాయ అధికారులకు రైతుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మగ్గిడి రాజేశ్వర్, బొల్లు పోతన్న, నారడీ మల్లయ్య, డాబ్బలింగం, భూపతి రెడ్డి, దోమకొండ రవీందర్, నక్కల బాజన్న, ప్రతినిధులు ధన్యవాదములు తెలిపారు.

## సోయా పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారి రాజు




**చట్టం మద్నూర్;** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం మద్నూర్ మండలం మరియు అవల్గోవ్ గ్రామాల్లో నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ (NMEO) పథకం ద్కింద,ఎఫ్ పీ వో (FPO) ద్వారా సోయాబీన్ తీసుకున్న రైతుల పొలాలను మండల వ్యవసాయ అధికారి రాజు పరిశీలించారు. సోయాబీన్ రకం DSB 34 మరియు MACS 1460 రకాలు రైతులకు ఇవ్వడం జరిగింది. ప్రస్తుతం సోయాబీన్ మంచిగా ఉందని, కాయలు మంచిగా కాస్తున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో లు సౌమ్య శ్రీ , విశాల్ గౌడ్ ,సరోజ, రాజహిత మరియు రైతులు సంజయ్, రామచంద్ర,తదితరులు పాల్గొన్నారు.

## సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి 9 ఆర్జీల స్వీకరణ



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం రోజు సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను సబ్ కలెక్టర్‌కు విన్నవించుకుంటూ అర్జీలను సమర్పించారు. ఈ రోజు జరిగిన ప్రజావాణిలో మొత్తం 09 దరఖాస్తులు వచ్చినట్లు కార్యాలయ అధికారులు తెలిపారు. ఇందులో అత్యధికంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి 06 అర్జీలు రాగా, పంచాయతీరాజ్ విభాగానికి 01, సబ్ కలెక్టర్ కార్యాలయానికి సంబంధించి 02 అర్జీలు నమోదయ్యాయి. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. భూ సమస్యలు, ఇతర ప్రజా సమస్యలపై వచ్చిన వినతులను ఆయా శాఖల అధికారులకు బదిలీ చేశామని, గడువులోగా వీటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా శ్రీ లక్ష్మి గణపతి స్వామి వార్షికోత్సవం

- **భక్తిశ్రద్ధలతో ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక పూజలు**
- **ఆధ్యాత్మిక శోభతో సింగరేణి ఏరియా ఆసుపత్రి ప్రాంగణం**



**చట్టం, రామకృష్ణాపూర్:** సింగరేణి ఏరియా ఆసుపత్రి ఆవరణలోని శ్రీ లక్ష్మీ గణపతి స్వామి దేవాలయ 9వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం భక్తిభావంతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం పుష్పాలంకరణలతో శోభాయమానంగా మారగా, వేద పండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల గణపతి నామస్మరణలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వార్షికోత్సవంలో భాగంగా స్వామివారికి అభిషేకం, అష్టోత్తర హారతి, నవగ్రహ హారతి, గణపతి పూజ, మండప ఆవాహిత లక్ష్మీ గణపతి పూజ, పూర్ణాహుతి తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ గణపతి హోమం నిర్వహించగా, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, డీవైసీఎంఓ దంపతులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేపట్టారు. ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, సింగరేణి కార్మికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విఘ్నేశ్వర స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. భక్తుల రాకతో ఆసుపత్రి ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అనంతరం నిర్వహించిన మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సీనియర్ పీఓ ఎం.డీ. మదర్ సాహెబ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మేకల రాజయ్య, సభ్యులు ఎం. జమదగ్ని, రాయల శ్రీనివాస్, భరత్ తిరుపతి, రమేష్, రఘు, శ్రీధర్, శ్రీకాంత్, టి. విజయలక్ష్మి, పుష్ప, సరోజ, సులోచన, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక రోడ్డు కబ్జా

- **ప్రజావాణిలో 26, 27 వార్డుల ప్రజల ఫిర్యాదు**



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సమస్యలపై ప్రజలు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఇందులో భాగంగా ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని 26, 27 వార్డులకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై, తమ వార్డు పరిధిలోని స్మశాన వాటిక రోడ్డు కబ్జాకు గురవుతోందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, స్మశాన వాటికకు వెళ్లే ప్రధాన రహదారిని ఓ వ్యక్తి అక్రమంగా ఆక్రమించి ఇల్లు నిర్మిస్తున్నాడని ఆరోపించారు. రోడ్డు కబ్జా కావడం వల్ల మృతదేహాలను అంత్యక్రియల కోసం తీసుకువెళ్లే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డును ఆక్రమించి నిర్మించిన ఇంటి స్థలాన్ని వెంటనే కూల్చివేసి, స్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని ప్రజలు డిమాండ్ చేశారు. ప్రజా రవాణాకు ఆటంకం కలిగిస్తూ, భూ కబ్జాకు పాల్పడిన సదరు వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ అధికారులకు వినతి పత్రం సమర్పించారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

CHATTAM NEWS

నిజామాబాద్
మంగళవారం
01.09.2026



# 27 వేల ప్రభుత్వ బడులను 4 వేలకు కుదించే కుట్ర

- హరీశ్ రావు
- రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కూ 15 శాతం కమీషన్ అడుగుతున్న దుస్థితి
- ఆరు డీఏలు పెండింగ్.. పీఆర్సీ ఊసే లేదు
- వెంటనే డీఎస్సీ నిర్వహించాలి.. అప్పటివరకు విద్యా వాలంటీర్లను నియమించాలి
- అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరిక





**చట్టం సిద్దిపేట ప్రతినిధి:** రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేల పాఠశాలలకు కుదించే పేరుతో బడులను మూసివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు ఆరోపించారు. ఉద్యోగులు జీవితాంతం దాచుకున్న రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందేందుకు కూడా 15 శాతం కమీషన్ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. సిద్దిపేట జిల్లా తడ్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు జోగు వెంకటేశం పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విద్యా విధానాలు, ఉద్యోగుల సమస్యలపై ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు 'మన ఊరుమన బడి' కార్యక్రమాన్ని చేపట్టామని హరీశ్ రావు తెలిపారు. మొదటి విడతలోనే తడ్కపల్లి పాఠశాలను ఎంపిక చేసి డిజిటల్ తరగతులు, డ్యూయల్ డెస్క్‌లు, డైనింగ్ హాల్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ కార్యక్రమాన్ని నిలిపివేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఒక్క కొత్త క్లాస్ రూమ్ అయినా నిర్మించారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న సుమారు 27 వేల పాఠశాలలను 4 వేల పాఠశాలలకు కుదిస్తామని ప్రభుత్వం చెబుతోందని, దీని వెనుక ప్రభుత్వ బడులను మూసివేసే ప్రయత్నం ఉందని ఆరోపించారు. ప్రతి నెలా ఉపాధ్యాయులు పదవీ విరమణ చేస్తున్నప్పటికీ వారి స్థానాల్లో కొత్త ఉపాధ్యాయులను నియమించడం లేదన్నారు. డీఎస్సీ నిర్వహించకుండా, విద్యా వాలంటీర్ల నియామకానికి కూడా అవకాశం ఇవ్వకుండా సర్దుబాట్లు, డెప్యుటేషన్లతో కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. తక్షణమే డీఎస్సీ నిర్వహించాలని, ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు విద్యా వాలంటీర్లను నియమించి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్లకు 2024 నుంచి వేతనాలు సక్రమంగా అందడం లేదని హరీశ్ రావు ఆరోపించారు. నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో ఉంటే వారి కుటుంబాలు ఎలా బతుకుతాయని ప్రశ్నించారు. కొన్ని చోట్ల ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బులతో ఖర్చులు భరించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఉద్యోగులు జీవితకాలం సంపాదించి దాచుకున్న జీపీఎఫ్, ఇన్సూరెన్స్ డబ్బులు పొందడానికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదలకు 15 శాతం కమీషన్ అడుగుతున్నారని ఓ ఉపాధ్యాయురాలు కన్నీళ్లు పెట్టుకున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. ఉద్యోగులకు ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పీఆర్సీపై స్పష్టత లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తామని ఇచ్చిన హామీపై ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల పరిస్థితి కూడా దయనీయంగా ఉందన్నారు. మార్కెట్‌లో కోడిగుడ్డు ధర రూ.8 వరకు ఉంటే ప్రభుత్వం తక్కువ మొత్తమే చెల్లిస్తోందని, ఆ ధరలతో పిల్లలకు నాణ్యమైన భోజనం ఎలా అందిస్తారని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ప్రారంభించిన బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని నిలిపివేశారని, తిరిగి ప్రారంభిస్తున్నామని ప్రకటించినా సిద్దిపేట జిల్లాను పక్కన పెట్టడం సరైంది కాదన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయ నియామకాలు, ఉద్యోగుల డీఏలు, పీఆర్సీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్ రావు తెలిపారు.

**జోగు వెంకటేశం సేవలకు రిటైర్మెంట్ లేదు**

పదవీ విరమణ పొందిన జోగు వెంకటేశం సేవలను హరీశ్ రావు కొనియాడారు. వెంకటేశం ఉపాధ్యాయ వృత్తికే పరిమితం కాకుండా సామాజిక సేవలోనూ ముందుండేవారని తెలిపారు. సిద్దిపేట అభయాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని, పద్మశాలి సమాజానికి గౌరవ అధ్యక్షుడిగా పేద, అట్టడుగు వర్గాల విద్యార్థుల చదువుకు సహకారం అందించారని చెప్పారు. తడ్కపల్లి పాఠశాలలో విద్యార్థుల ప్రార్థనా వేదికను సొంత ఖర్చులతో నిర్మించారని తెలిపారు. బీసీ హాస్టల్ విద్యార్థులకు పడకలు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వెంకటేశం తన దృష్టికి తీసుకురాగానే సొంత ఖర్చులతో బెడ్స్ ఏర్పాటు చేసినట్లు హరీశ్ రావు గుర్తుచేశారు. పూర్వ విద్యార్థులను ప్రోత్సహించి పాఠశాలకు విరాళాలు అందేలా కృషి చేయడంతో పాటు కంప్యూటర్ ల్యాబ్, వాటర్ ప్లాంట్ ఏర్పాటులో వెంకటేశం చొరవ చూపారని పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటులో కూడా ముందుండారని తెలిపారు. 61 ఏళ్ల వయసుతో ఉద్యోగానికి పదవీ విరమణ వచ్చినా వెంకటేశం సామాజిక సేవకు రిటైర్మెంట్ లేదని హరీశ్ రావు అన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవిస్తూ మరింత సామాజిక సేవ చేయాలని ఆకాంక్షించారు.

## కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరచాలి



**చట్టం రామగుండం :** బిజెపి వారం రోజుల కార్యచరణలో భాగంగా కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల్లో మోసపూరిత 6గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కి మూడు సంవత్సరాలు పూర్తి అయిన ఇంకా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ యొక్క వాగ్దానాన్ని కూడా నెరవేర్చ లేకపోయిందని ప్రజా ప్రభుత్వం అని చెప్పి పాలనలోకి వచ్చినక ప్రజాకంటక పాలన నడిపిస్తున్నారని ఆరోపిస్తూ బిజెపి రాష్ట్ర నాయకురాలు సోమవారపు లావణ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరచాలని కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మేయర్ మహంకాళి స్వామి కి మరియు స్థానిక కాంగ్రెస్ 12వ డివిజన్ కార్పొరేటర్ MD బాబు మియా కి 23వ డివిజన్ కార్పొరేటర్ బేంద్రం సునీత రెడ్డి కి 42 వ డివిజన్ కార్పొరేటర్ పాతిపల్లి కావ్య కి 44వ డివిజన్ కార్పొరేటర్ కర్రవుల డేవిడ్ రాజుకి వినతి పత్రం అందజేస్తూ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరుతూ లేని పక్షంలో ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ యొక్క కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు సోమారపు అరుణ్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మామిడి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షురాలు మాతంగి రేణుక, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు సుజనా శ్రీ, చల్లా శోభరెడ్డి, సీనియర్ నాయకులు దాసరి శ్రీనివాస్, మారేపల్లి శ్రీనివాస్, బూడిద రమేష్, అంకం తిరుపతి, పంగ రవి, పొట్ల రవి, అరిగెల శ్రావణ,మెరుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## హిందీ ఫోరానికి కొత్త సారథ్యం

- మండల అధ్యక్షుడిగా బలవంతరావు ఏకగ్రీవ ఎన్నిక



**చట్టం/ ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మండల హిందీ ఉపాధ్యాయుల ఫోరం సోమవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల హిందీ ఫోరం అధ్యక్షుడిగా బలవంతరావు ఎన్నికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఫోరం ప్రధాన కార్యదర్శిగా మాధురి, మహిళా కార్యదర్శిగా విజయలక్ష్మి, కోశాధికారిగా దశరథం ఎన్నికైనట్లు వెల్లడించారు. హిందీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, విద్యా రంగ అభివృద్ధి కోసం నూతన కార్యవర్గం సమష్టిగా కృషి చేయాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు బలవంతరావుతో పాటు కార్యవర్గ సభ్యులను మండలంలోని హిందీ ఉపాధ్యాయులు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

## ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా నార్సింగి మండలం నర్సంపల్లి గ్రామంలో చామర్తి ప్రభాకర్ కి ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సిఎంఆర్ఎఫ్కు అప్లై చేసుకోగా దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి, ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 38 వేల రూపాయలు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరు చేయడం జరిగింది. ఈరోజు భారత కుటుంబానికి అందజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొమ్మగారి సత్తయ్య, గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు పైతరి లాలం, వార్డు మెంబర్ సామర్తి ప్రశాంత్, ఉడుత రవి. మాజీ వార్డ్ మెంబర్ బాబు, లబ్ధిదారులు సామర్తి సత్తవ్వ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ ఉపాధ్యాయునికి ఘన సన్మానం



**చట్టం, బోథ్ :** బోథ్ మండల కేంద్రం కౌటా (బి) గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. గంగారాం పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ గంగారాం కు శుభాకాంక్షలు తెలియజేసి, విద్యార్థులకు ఎన్నో సంవత్సరాలుగా అందించిన సేవలను అభినందించారు. అనంతరం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లేష్, పన్నాల శమేందర్ రెడ్డి, బోథ్ వార్డు మెంబర్ గిరీష్, కౌసర్, కురుమే గంగయ్య తదితర నాయకులు పాల్గొని గంగారం కు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయం. పదవీ విరమణ అనంతరం గంగారం సార్ ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై భగ్గుమన్న విద్యార్థులు

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడికి యత్నం



**చట్టం / ఎల్లారెడ్డి :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎల్లారెడ్డిలో విద్యార్థులు, కార్యకర్తలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా SWC సభ్యుడు చరణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి ఉన్నారని ప్రస్తావించారు. ప్రభుత్వం బకాయిలను సకాలంలో విడుదల చేయకపోవడంతో రూ.12 వేల కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయని ఆయన ఆరోపించారు. ఫీజులు అందక విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని, సర్టిఫికెట్లు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని చరణ్ హెచ్చరించారు. ఈ నిరసనతో ప్రభుత్వం కళ్లుతెరవాలని, లేనిపక్షంలో కళాశాలలు, విశ్వవిద్యాలయాలను ఉద్యమ వేదికలుగా మారుస్తామని అన్నారు. అనంతరం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడికి కార్యకర్తలు ప్రయత్నించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్తాఫ్, కౌశిక్, వెంకట్, రాజశేఖర్, రాజు, భారత్, అజర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతకు షీ టీమ్స్ నిరంతర నిఘా

- జిల్లా వ్యాప్తంగా 5 ఈ పెట్టి కేసులు
- వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు: ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లాలో మహిళలు, యువతులు, విద్యార్థినుల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. మహిళలను వేధించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడటం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు షీ టీమ్స్ నిరంతరం నిఘా కొనసాగిస్తున్నాయని తెలిపారు. జిల్లాలో షీ టీం సిబ్బంది ఆధ్వర్యంలో 33 అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి,షీ టీమ్స్ నిఘాలో మహిళలు, విద్యార్థులకు మహిళల భద్రత, వేధింపుల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించినట్లు ఎస్పీ తెలిపారు. మహిళలు తమకు ఎదురయ్యే వేధింపులపై భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. షీటీమ్స్ నిఘాలో 62 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. వారిలో 57 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి, 5 పెట్టీ కేసులు నమోదు చేసి, మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాలు, విద్యాసంస్థలు, రద్దీ ప్రాంతాల్లో షీ టీమ్స్ నిఘాను మరింత పటిష్టం చేస్తామని ఎస్పీ తెలిపారు. మహిళలు, బాలికల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, వేధింపులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



**చట్టం భీంగల్ :** భీంగల్ పురపాలక కార్యాలయంలో ఈరోజు కల్యాణ లక్ష్మి(11), షాదీ ముబారక్(04) పథకాల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. మొత్తం 15 చెక్కులను లబ్ధిదారులకు ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి కౌన్సిలర్లతో కలిసి అర్హులైన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి. గజానంద్, కౌన్సిలర్లు మమ్మద్ అంజుమ్ అలీ, తోట సతీష్, నీలం రవి, ప్రజాప్రతినిధులు జై జై నరసయ్య, ఆరేపల్లి నాగేంద్రబాబు, లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## మెదక్ జిల్లాలో సెప్టెంబర్ 1 నుంచి పోలీస్ యాక్ట్ అమలు

- ధర్నాలు.. రాస్తారోకోలకు ముందస్తు అనుమతి తప్పనిసరి
- మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి శ్రీనివాస రావు ఐపీఎస్



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా సెప్టెంబర్ 1 నుండి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ - 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. ఈ సమయంలో పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఏవిధమైన ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని జిల్లా ఎస్పీ తెలిపారు. అలాగే ప్రజల/ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక చర్యలు, అశాంతి సృష్టించే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. శాంతి భద్రతల నిర్వహణలో ఎవరైనా విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులు చేపడుతున్న చర్యలకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజావాణిలో ప్రెస్ క్లబ్ కమిటీ వినతిపత్రం**



**చట్టం, భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మండల ప్రెస్ క్లబ్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. మొగుళ్లపల్లి మండలంలో వివిధ పత్రికలు, వెబ్ ఛానళ్లు, ఇతర మీడియా సంస్థల్లో దాదాపు 30 మంది జర్నలిస్టులు పనిచేస్తున్నారని, ఇప్పటివరకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా తమకు ఆశించిన స్థాయిలో ప్రయోజనం అందలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంలోనైనా వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గృహాలు మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఎలాంటి ఖర్చు లేకుండా వైద్య సేవలు పొందే విధంగా హెల్త్ కార్డులు అందించాలని విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి జర్నలిస్టుల కోసం ప్రత్యేక ప్రెస్ భవన్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సేవలను గుర్తించి వారి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్షుడు నిమ్మల సారయ్య, ప్రధాన కార్యదర్శి కట్కూరి ఐలయ్య, ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

- డీఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్

**చట్టం, మెదక్ ప్రతినిధి :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని సకాలంలో పరిష్కరించాలని డీఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ ఆదేశించారు. సోమవారం మెదక్ ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 48 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. వాటిలో భూ భారతి సమస్యలకు సంబంధించి 16, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి 6, పెన్షన్‌కు సంబంధించి 1, ఇతర సమస్యలకు సంబంధించి 25 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, వినతుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిష్కరించిన ప్రతి దరఖాస్తు వివరాలను ప్రజావాణి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా స్పందించి, సంబంధిత శాఖల పరిధిలో ఉన్న వినతులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

- ప్రజావాణిలో ఆర్టీఐ మండల నాయకుడు గడ్డం రమేష్ ఫిర్యాదు



**చట్టం, భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ఇప్పలపల్లి గ్రామంలో పారిశుధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వాటి పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్టీఐ మండల నాయకుడు గడ్డం రమేష్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గడ్డం రమేష్ మాట్లాడుతూ గ్రామంలో గత కొన్ని రోజులుగా మురికి కాలువలను శుభ్రం చేయడం లేదని ఆరోపించారు. కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు పెరిగి ప్రజలు విషజ్వరాలు, మలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గ్రామంలో తాగునీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చెత్త సేకరణ వాహనం కూడా గ్రామానికి క్రమం తప్పకుండా రావడం లేదని, దీంతో వీధుల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసనతో పాటు అనారోగ్య సమస్యలకు కారణమవుతోందని ఆరోపించారు. అలాగే పలు ప్రాంతాల్లో వీధి దీపాలు పనిచేయకపోవడంతో రాత్రి సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. చీకటి కారణంగా పాములు, తేళ్లతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పలపల్లి గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీరు, చెత్త సేకరణ, వీధి దీపాల సమస్యలను అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కరించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం ఉంటే సంబంధిత పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో కోరినట్లు గడ్డం రమేష్ తెలిపారు.

## యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం కోసమే ఐకాన్ అవార్డ్స్ ప్రధానం

- వి. ఎస్. ఎస్.ఎస్ చైర్మన్ డా, సురభి శ్రీధర్



**చట్టం రామగుండం :** యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడం కోసమే ఐకాన్ అవార్డ్స్ అని వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండ్ అండ్ చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ తెలిపారు. ఆదివారం రాత్రి హైదరాబాద్ కింగ్ కోటి, తిలక్ రోడ్, బొంగులకుంటలోని తెలంగాణ సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో, స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, ఏషియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ, సంస్థల ఫౌండర్ అండ్ చైర్మన్ లయన్. డా, ఆకుల రమేష్ ఆధ్వర్యంలో పలు రంగాలలో సేవలందిస్తున్న సామాజిక సేవలకు, ప్రజా ప్రతినిధులకు పారిశ్రామిక వేత్తలకు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు అవార్డుల ప్రధానం కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ తోపాటు డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి, డాక్టర్ కుంట సురేష్, డాక్టర్ కోడెల మంజుల డాక్టర్ పి జి సుదర్శన్ హాజరయ్యారు. అనంతరం యువ పారిశ్రామిక వేత్త లియో లైఫ్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత పంజాల శివకుమార్ కు బిజినెస్ ఐకాన్ అందించడం జరిగింది. చిన్న వయసులోనే బిజినెస్ రంగంలో అడుగు పెట్టి ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తు స్వయంకృషితో ముందుకు సాగితే గొప్ప విజయం సాధించవచ్చు అనే సంకల్పంతో ముందుకు వెళుతూ లియో లైఫ్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ఏర్పాటు చేసి ఎంతోమందికి ఉపాధిని కల్పిస్తున్న పంజాల శివకుమార్ కు బిజినెస్ ఐకాన్ అవార్డు ను అందించడం జరిగిందని వారు తెలిపారు. అనంతరం అవార్డు గ్రహీత శివకుమార్ మాట్లాడారు. తన విజయానికి తొలి అడుగు ఈ ఐకాన్ అవార్డు అని అవార్డుకు సహకరించిన వెలుగు సామాజిక స్వచ్ఛత సంస్థ చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ కు, అవార్డును అందించిన డాక్టర్ ఆకుల రమేష్ కు. కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని శివ తెలిపారు. శివకుమార్ కు అవార్డు రావడం పట్ల లియో లైఫ్ సంస్థ సభ్యులు తోపాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

- ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత తప్పనిసరి
- జాప్యం లేకుండా సమస్యలు పరిష్కరించాలి : ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు



**చట్టం మెదక్ ప్రతినిధి :** ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర అంశాలపై ఫిర్యాదులు అందజేశారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్రంగా విచారణ చేపట్టి చట్టపరమైన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయరాదని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా పరిగణించి, విచారణ పురోగతిని ఫిర్యాదుదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ద్వారా పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యమని ఎస్పీ తెలిపారు. సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజలు ఎలాంటి భయం, సంకోచం లేకుండా పోలీసులను సంప్రదించాలని, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు.

## మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు ఎస్ఐఆర్ నోటీసు



**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** వరుసగా ఐదుసార్లు కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ కు సోమవారం 'ఎస్ఐర్' నోటీసు అందజేశారు. ఆయన స్వగ్రామమైన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామంలోని ఆయన నివాసానికి అధికారులు నోటీసు పంపించారు. 2002 సంవత్సరానికి ముందు నుంచి ఇటీవల వరకు ఓటర్ల జాబితాలో ఆయన తండ్రి పేరు 'వెంకయ్య'గా నమోదై ఉంది. అయితే ఆధార్ కార్డులో వెంకయ్య పేరుకు పక్కన వారి ఇంటి మారుపేరు 'గంప' అని ఉండటంతో బీఎల్ ఓలు నోటీసు జారీ చేసినట్లు తెలుస్తోంది. దీంతో అధికారులు ఇచ్చిన నోటీసుపై స్థానికంగా ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. తండ్రి పేరు పక్కన ఇంటి మారుపేరు ఉంటే నోటీసు ఇస్తారా, ఇదెక్కడి విచిత్రం చర్చించుకుంటున్నారు. పలువురు.

## ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ సహజమే



**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** ఉద్యోగులకు పదవి విరమణ అనేది కాకుండా విరమణ పొందడం జరుగుతుందన్నారు. జీవితంలో విరమణ పొందడం, జీవితంలో విరమణ పొందిన అనంతరం జీవిత ఆశయం కోసం విరమణ అని ఉండదని అన్నారు. జీవితంలో ఎన్నో ఆశయాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంలో విరమణ అడ్డు రాదని అన్నారు. లక్ష్యం కోసం పనిచేసేందుకు వివిధ మార్గాలను విరమణ తర్వాత లక్ష్యంగా పెట్టుకొని సాధించడమే ధ్యేయంగా పనిచేయాలని అన్నారు.ఆయురారోగ్యాలతో పాటు తన జీవిత లక్ష్యాలను సాధించడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సొసైటీ చైర్మన్ చంద్రయ్య అనంతరెడ్డి, జిల్లా క్లస్టర్ ఆఫీసర్ నగేష్,మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్, యూనియన్ లీడర్ సాలెన్, రావులపల్లి నర్సారెడ్డి, అంకత్ నర్సింలు, బుర్లింగం, కదిరి దుర్గారెడ్డి, నాగరపు రాములు, షేక్ మహమ్మద్, లింగం, రామ్ రెడ్డి, రాకేష్ రెడ్డి, నీరజ్ రెడ్డి, అశోక్, ప్రభాకర్ రెడ్డి, రమణి, నర్సింలు వివిధ గ్రామాల సీఈవోలు, డైరెక్టర్లు, రైతులు, నవీన్, ప్రమోద్ రెడ్డి, మహాలింగం,గులాం, అంకత్ సంకిర్త్ తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్స్‌డ్ సర్వేయర్లకు గౌరవ వేతనం కల్పించాలి

- **దాసరి ఉష**




**చట్టం, రామగుండం :** లైసెన్స్‌డ్ సర్వేయర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని BRS పెద్దపల్లి నాయకురాలు దాసరి ఉష డిమాండ్ చేశారు. పెద్దపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఆమె సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ, అర్హతలు పరిశీలించి శిక్షణ ఇచ్చిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా 6,500 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఉపాధి కల్పించామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని విమర్శించారు. 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం, లైసెన్స్‌డ్ సర్వేయర్లకు కనీస గౌరవ వేతనం కూడా అందించకుండా పనిచేయించుకోవడం సమర్థనీయం కాదన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఇబ్బందులు కలిగిస్తున్న GO 174ను వెంటనే రద్దు చేయాలని, వారికి నిర్దిష్టమైన గౌరవ వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు, సరైన కారణాలు లేకుండా విధుల నుంచి తొలగించిన సర్వేయర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఉద్యోగాలు ఇచ్చామని ప్రచారం చేసుకోవడం మాత్రమే ప్రభుత్వ బాధ్యత కాదని, ఉద్యోగులకు గౌరవం, ఉద్యోగ భద్రత, తగిన వేతనం కల్పించినప్పుడే నిజమైన న్యాయం జరుగుతుందని దాసరి ఉష పేర్కొన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు వారి న్యాయమైన పోరాటానికి BRS అండగా ఉంటుందని తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

- **డీఆర్వో వసంతకుమారి**

**చట్టం, భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 62 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో వసంతకుమారి మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టి, పరిష్కరించిన వివరాలను సంబంధిత పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందించి, వారి వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం గతంలో భూపాలపల్లి ఆర్డీవోగా విధులు నిర్వహించి, ప్రస్తుతం వికారాబాద్ డీఆర్వోగా పనిచేస్తూ అకాల మరణం చెందిన మంగీలాల్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ అధికారులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కెమిస్ట్రీ పీజీటీలకు బోధనా ఛాన్స్

- **పీరియడ్‌కు రూ.182 గౌరవ వేతనం.. సెప్టెంబర్ 7లోగా దరఖాస్తు**



**చట్టం/ ఎల్లారెడ్డి :** గోపాల్‌పేటలోని తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో గంటల ప్రాతిపదికన పీజీటీ (కెమిస్ట్రీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.రాంప్రసాద్ తెలిపారు. రసాయన శాస్త్రంలో ఎం.ఎస్సీ., బి.ఎడ్ అర్హత కలిగిన అభ్యర్థులు తమ రెజ్యూమ్‌తో పాటు విద్యార్హత, అనుభవ ధ్రువపత్రాల ప్రతులను సెప్టెంబర్ 7లోగా కళాశాల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఎంపికలో భాగంగా అభ్యర్థులకు ముందస్తు సమాచారం అందించి 10వ తరగతి విద్యార్థులకు డెమో తరగతి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి ప్రతి పీరియడ్‌కు రూ.182 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు పని వేళల్లో ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

## జర్మనీతో తెలంగాణకు కొత్త పెట్టుబడి బాట

- **సెమీకండక్టర్లు, అధునాతన తయారీపై కీలక చర్చలు**




**చట్టం/ ఎల్లారెడ్డి :** తెలంగాణలో జర్మన్ కంపెనీల పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై సోమవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు జర్మన్ ఇండియన్ బిజినెస్ అలయన్స్ (GIBA) ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. కెల్‌స్టర్‌బాచ్ మేయర్ మాన్‌ఫ్రెడ్ ఓకెల్ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో జరిగిన భేటీలో తెలంగాణలో సెమీకండక్టర్లు, అధునాతన తయారీ, ఎలక్ట్రానిక్స్, ప్రెసిషన్ ఇంజినీరింగ్ రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. తెలంగాణ-జర్మనీ మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, రాష్ట్ర ఎగుమతిదారులు జర్మనీతో పాటు యూరోపియన్ మార్కెట్లను సులభంగా చేరుకునేలా లాజిస్టిక్స్ కారిడార్ ఏర్పాటుపైనా చర్చ జరిగినట్లు తెలిపారు. తెలంగాణకు జర్మన్ సాంకేతికత, పెట్టుబడులు, ఆధునిక తయారీ రంగాన్ని మరింతగా తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ఇంటర్ అడ్మిషన్ గడువు పెంపు



**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ ప్రక్రియ వచ్చేనెల 7 వరకు ప్రభుత్వం పొడిగించినట్లు కామారెడ్డి జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి షేక్ సలాం తెలిపారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు.

# సెల్‌ఫోన్‌కు బానిస కావొద్దు.. చెస్‌తో మెదడుకు పదును

- **హరీశ్ రావు**
- **సిద్దిపేట మెరిడియన్ స్కూల్‌లో జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్**
- **భోజనం సమయంలో సెల్‌ఫోన్ వాడొద్దని విద్యార్థులకు సూచన**
- **అఖిల ఎంబీబీఎస్ చదువు పూర్తి ఖర్చు భరిస్తానని హామీ**
- **గజ్వేల్‌లో స్టేట్ లెవెల్ చెస్ ఛాంపియన్‌షిప్‌కు సంపూర్ణ సహకారం**






**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** పిల్లలు సెల్‌ఫోన్ వ్యసనం నుంచి బయటపడి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు సూచించారు. మొబైల్ మనకు బానిసగా ఉండాలి తప్ప మనం మొబైల్‌కు బానిసలుగా మారకూడదని చెప్పారు. చెస్ వంటి ఆటలు పిల్లల్లో ఆలోచనా శక్తి, చురుకుదనం, వ్యూహాత్మక సామర్థ్యాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. సిద్దిపేటలోని మెరిడియన్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌కు హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న సుమారు 168 మంది విద్యార్థులను అభినందించారు. విద్యార్థులతో సరదాగా ముచ్చటిస్తూ సెల్‌ఫోన్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, ప్రస్తుతం పిల్లల్లో సెల్‌ఫోన్ వినియోగం వ్యసనంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. భోజనం చేసేటప్పుడు కూడా ఫోన్ చూస్తే తప్ప ముద్ద మింగలేని పరిస్థితి కొందరిలో కనిపిస్తోందని అన్నారు. ఇటీవల ఒక ఆస్పత్రి ప్రారంభోత్సవానికి వెళ్లిన సమయంలో ఏడాదిన్నర చిన్నారి సెల్‌ఫోన్‌కు తీవ్రంగా అలవాటు పడిన విషయాన్ని చూసి ఆశ్చర్యపోయానని తెలిపారు. అవసరానికి మాత్రమే మొబైల్ వినియోగించాలని, దానికి పూర్తిగా లొంగిపోవద్దని విద్యార్థులకు సూచించారు. ఫోన్లను పక్కనపెట్టి ఫుట్‌బాల్, వాలీబాల్, క్రికెట్ వంటి అవుట్‌డోర్ క్రీడల్లో పాల్గొనాలని చెప్పారు. గంటల తరబడి మొబైల్ ఫోన్లతో గడపడం వల్ల సృజనాత్మకత, ఆలోచనా శక్తి, చురుకుదనం తగ్గే అవకాశం ఉందన్నారు. చెస్ ఆట మెదడుకు పదును పెట్టడంతో పాటు ముందుచూపును పెంచుతుందని వివరించారు. చెస్‌లో రాజు, మంత్రి, ఏనుగు, బంటు వంటి ప్రతి పావుకు ప్రత్యేకత ఉంటుందని, సరైన వ్యూహంతో చిన్న బంటు కూడా రాజుకు చెక్ పెట్టగలదని చెప్పారు. చెస్‌లో వేసే ప్రతి అడుగు ఎంత కీలకమో జీవితంలో తీసుకునే నిర్ణయాలు కూడా అంతే కీలకమని పేర్కొన్నారు. ఎదుటివారి వ్యూహాలను పసిగట్టడం, ముందుగానే ఆలోచించడం, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడం వంటి లక్షణాలను చెస్ నేర్పుతుందని తెలిపారు. చదువుతో పాటు క్రీడలు, ఆరోగ్యానికి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆటల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించే తత్వం అలవడితే జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను ధైర్యంగా ఎదుర్కొనే శక్తి పెరుగుతుందని చెప్పారు. భోజనం చేసేటప్పుడు సెల్‌ఫోన్ చూడకుండా ఉంటామని విద్యార్థులు తమకు తామే మాట ఇచ్చుకోవాలని కోరారు. స్కూల్ కార్యక్రమానికి మరోసారి వచ్చినప్పుడు తల్లిదండ్రులను అడిగి తెలుసుకుంటానని సరదాగా వ్యాఖ్యానించారు. పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచే బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై కూడా ఉందన్నారు. మెరిడియన్ స్కూల్‌లో చదివిన అఖిల అనే పేద విద్యార్థిని ఎంబీబీఎస్ సీటు సాధించి సిద్దిపేట మెడికల్ కాలేజీలో చేరడం అభినందనీయమన్నారు. ఆమెను నాలుగేళ్ల పాటు చదివించిన మెరిడియన్ స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. అఖిల మెడిసిన్ పూర్తి చేసే వరకు చదువుకు అవసరమైన ఖర్చును తానే భరిస్తానని ప్రకటించారు. గజ్వేల్‌లో నిర్వహించనున్న స్టేట్ లెవెల్ చెస్ ఛాంపియన్‌షిప్ విజయవంతం కావడానికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని హరీశ్ రావు తెలిపారు. జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులను అభినందించారు.

## ఘనంగా గైని గంగారాం పదవీ విరమణ మహోత్సవం



- **తెలంగాణ ఉద్యమంలో గంగారాం సేవలు చిరస్మరణీయం**
- **సెప్టెంబర్ 1న సీపీఎస్ విద్రోహ దినం.. 10న చలో హైదరాబాద్‌కు తరలిరావాలి: టీఎన్జీవో నేతల పిలుపు**

**చట్టం నిజామాబాద్:** నీటిపారుదల శాఖలో వివిధ హోదాల్లో సుమారు 40 సంవత్సరాల పాటు సేవలందించి సూపరింటెండెంట్‌గా పదవీ విరమణ పొందిన టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గైని గంగారాం పదవీ విరమణ మహోత్సవం సోమవారం నగరంలోని శ్రీరామ గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. టీఎన్జీవో జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేని (ముజీబ్) ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గైని విద్యావతి-గంగారాం దంపతులను శాలువాలు, గజమాలతో ఘనంగా సన్మానించి ఆత్మీయ జ్ఞాపికను అందజేశారు. పదవీ విరమణ అనంతరం వారి జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉద్యోగ సంఘ నాయకుడిగా గైని గంగారాం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుగ్గా పాల్గొని ఉద్యోగులను ఉద్యమంలో భాగస్వాములను చేయడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నిజామాబాద్ జిల్లాను రాష్ట్ర స్థాయిలో ముందంజలో నిలిపేందుకు ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. ఉద్యోగ జీవితంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించడంతో పాటు ఉద్యోగ సంఘాల బలోపేతానికి సేవలందించారని తెలిపారు.

**సీపీఎస్ రద్దు కోసం పోరాటం ఉధృతం**

ఈ సందర్భంగా ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేని మాట్లాడుతూ ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణను కొనసాగిస్తామని తెలిపారు. ఆగస్టు 27న టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాను విజయవంతం చేసిన ఉద్యోగులకు ఉద్యమాభివందనాలు తెలిపారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా సెప్టెంబర్ 1న మధ్యాహ్నం ఒంటి గంటకు నిజామాబాద్ ఐడీఓసీ కార్యాలయ ఆవరణలో 'సీపీఎస్ విద్రోహ దినం' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సీపీఎస్ రద్దు చేయడంతో పాటు ఉద్యోగుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 10న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి జిల్లాలోని ఉద్యోగులందరూ సైనికుల్లా భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర సహాధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, వ్యవసాయ శాఖ కమిషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, జగిత్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేందర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సతీష్, జిల్లా సహాధ్యక్షుడు పెద్దోళ్ల నాగరాజు, కోశాధికారి నిరంజన్ గౌడ్, ముఖ్య సలహాదారు వనమాల సుధాకర్ పాల్గొన్నారు. అలాగే జిల్లా కార్యవర్గ సభ్యులు సంజీవయ్య, శివకుమార్, జాఫర్ హుస్సేన్, శ్రీనివాస్, మాణిక్యం, జాకీర్ హుస్సేన్, జ్ఞానేశ్వర్, శశికాంత్ రెడ్డి, సృజన్ కుమార్, ప్రవీణ్ రాజ్, సూర్యప్రకాశ్, కార్తీక్, మారుతి, సాయి కుమార్, విశాల్ గౌడ్, గీతారెడ్డి, మంగారెడ్డి, శ్రీవేణి, రాజేశ్వర్, సునీల్ గురుచరణ్, స్వామితో పాటు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై గైని గంగారాంకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా మహంకాళమ్మ జాతర రెండో రోజు వేడుకలు

- **గావు, రంగాలు, భవిష్యవాణి, పోతురాజుల విన్యాసాలతో సందడి**



**చట్టం, మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం మాసాయిపేట మండల కేంద్రంలో మహంకాళమ్మ జాతర రెండో రోజు వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గావు, రంగాలు, భవిష్యవాణి, పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామస్తులు, మహిళలు, యువకులు, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా గ్రామ ప్రజలంతా ఒకే వేదికపై జాతరలో పాల్గొనడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించారు. మాసాయిపేట గ్రామం ఏర్పడిన నాటి నుంచి మహంకాళమ్మ జాతరను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఏటా శ్రావణ మాసంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో సకాలంలో వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండుతాయని, పశుపక్షాదులకు ఆహార కొరత లేకుండా గ్రామం సుభిక్షంగా ఉంటుందని భక్తుల విశ్వాసం. మాసాయిపేటలో హిందూ-ముస్లిం ఐక్యతను చాటుతూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మహంకాళమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న దర్గాను చాదర్, పూలతో అలంకరించారు. హిందూ, ముస్లిం సోదరులు కలిసి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం స్వీట్లు, మలీదను ప్రసాదంగా స్వీకరించారు. మత సామరస్యానికి మాసాయిపేట నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోందని పలువురు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో స్థానిక సర్పంచ్ వీరన్న కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ పసుల వెంకటేశం, పీఏసీఎస్ డైరెక్టర్ ఊదండపురం నర్సింలు, పాలకవర్గ సభ్యులు, మాజీ సర్పంచ్ చిన్న చౌదరి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సిద్ధిరాములు గౌడ్, మాజీ సర్పంచ్ చిట్టిమిల్ల నాగరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ నాగిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ములుగు నాగేందర్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, యువకులు, కుల సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు, మహిళలు, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## హరిపురంలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ప్రభుత్వ విప్ విజయరమణ రావు



**చట్టం, పెద్దపల్లి :** ఓదెల మండలం హరిపురం గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించగా, నూతనంగా నిర్మించిన ఇళ్లను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపిన విజయరమణ రావు, నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలకు దశలవారీగా ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తూ గృహ భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పొందిన లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్, గ్రామ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించకపోతే హోటల్స్ బంద్ చేసుకోండి

- **నిబంధనలు ఉల్లంగిస్తే...సీజ్ చేస్తాం**
- **కామారెడ్డిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు**
- **ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు -పలు హోటళ్లకు నోటీసులు జారీ**



**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** కామారెడ్డి పట్టణంలోని న్యూ బస్ స్టాండ్ పరిసరాల్లో ఉన్న పలు హోటళ్లు, రెస్టారెంట్లను ఆహార భద్రతాధికారి జి. విక్రమ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటళ్ల వంటశాలల పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ, తయారీ విధానం, వినియోగిస్తున్న పరికరాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో పలు హోటళ్ల వంటశాలలు అపరిశుభ్రంగా ఉన్నట్లు, కొన్ని చోట్ల స్టెయిన్లెస్ స్టీల్ కత్తులకు బదులుగా ఇనుప కత్తులను వినియోగిస్తున్నట్లు గుర్తించామని అధికారి తెలిపారు. నిబంధనలు పాటించని యజమానులకు మెరుగుదల నోటీసులు జారీ చేసి, లోపాలను నిర్ణీత గడువులోగా సరిదిద్దాలని ఆదేశించామన్నారు. లేనిపక్షంలో ఆహార భద్రతా నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించేందుకు నిరంతరం తనిఖీలు కొనసాగిస్తామని ఫుడ్ సేఫ్టీ అధికారి జి. విక్రమ్ తెలిపారు.

## గంగారం మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా గిరగాని ప్రవీణ్ నియామకం



**చట్టంన్యూస్ గంగారం :** మహబూబాబాద్ జిల్లా గంగారం మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా గిరగాని ప్రవీణ్ నియమితులయ్యారు. మండల పార్టీ నాయకత్వం, జిల్లా పెద్దల సూచన మేరకు ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా గిరగాని ప్రవీణ్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ జెండాను మరింత బలంగా ఎగురవేసేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. గిరగాని ప్రవీణ్ నియామకం పట్ల మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థుల నృత్యాలు, పాటలతో ఘనంగా వీడ్కోలు

- **పదవీ విరమణ చేసిన శ్రీకాంత్‌కు బోర్గం హైస్కూల్‌లో ఆత్మీయ సత్కారం**



**చట్టం నిజామాబాద్:** నిజామాబాద్ నగరంలోని 5వ డివిజన్ పరిధిలోని బోర్గం హైస్కూల్‌లో పదవీ విరమణ చేసిన శ్రీకాంత్‌కు సోమవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, పాటలతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి శ్రీకాంత్‌పై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ పలువురు విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ పదవీ విరమణ ఉద్యోగ జీవితానికే పరిమితమని, సమాజ సేవకు ఎలాంటి విరమణ ఉండదని పేర్కొన్నారు. విద్యార్థుల అభివృద్ధికి శ్రీకాంత్ అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా సామాజిక, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు మాట్లాడుతూ శ్రీకాంత్ అందించిన మార్గదర్శకత్వం, ప్రేమాభిమానాలను ఎప్పటికీ మరచిపోలేమని తెలిపారు. తమ భవిష్యత్తుకు ఉపయోగపడే ఎన్నో విషయాలను నేర్పించారని, ఆయన ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని కోరుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు శ్రీకాంత్‌ను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

# గంగపుత్ర సమాజానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా

- ఎమ్మెల్యే ముఠా గోపాల్




**చట్టం హైదరాబాద్:** గంగపుత్ర విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన గంగపుత్ర వర్కింగ్ ఉమెన్స్ సమావేశం ఆదివారం తార్నాకలోని సత్యోదయ రిట్రీట్ మందిరంలో ఘనంగా జరిగింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 200 మందికిపైగా గంగపుత్ర మహిళలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంగపుత్రులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. గంగపుత్ర సమాజానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం అమలు చేస్తున్న సంక్షేమ, ఆర్థికాభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు. పిల్లలను ఉన్నత విద్య చదివించి, నేటి పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనే విధంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

**గంగపుత్ర మహిళల సమస్యలపై విస్తృత చర్చ..**

సమావేశంలో గంగపుత్ర మహిళలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ తదితర సమస్యలపై విస్తృతంగా చర్చ జరిగింది. మహిళలపై కొనసాగుతున్న వివక్షను అధిగమించేందుకు ఐక్యంగా పనిచేయాల్సిన అవసరాన్ని పలువురు వక్తలు ప్రస్తావించారు. ఈ సందర్భంగా గంగపుత్ర వర్కింగ్ ఉమెన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలిగా డాక్టర్ దేశబోయిన రమాదేవిని, ప్రధాన కార్యదర్శిగా పంపరి మంగని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితోపాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించే విధంగా 35 మంది కమిటీ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**రాజకీయాల్లో గంగపుత్ర మహిళల ప్రాతినిధ్యం పెరగాలి : డాక్టర్ రమాదేవి**

నూతనంగా ఎన్నికైన అధ్యక్షురాలు డాక్టర్ దేశబోయిన రమాదేవి మాట్లాడుతూ.. గంగపుత్ర మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, ముఖ్యంగా సామాజిక వివక్షపై ఆందోళన వ్యక్తం చేశారు. గంగపుత్ర మహిళలందరూ ఐక్యంగా ఉంటే తమ సమస్యలపై సమర్థవంతంగా పోరాడే అవకాశం ఉంటుందని అన్నారు. గంగపుత్ర మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రిజర్వేషన్లను గంగపుత్ర విద్యార్థులు, ఉద్యోగులు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై గంగపుత్ర మహిళలకు అవగాహన కల్పించి, వాటిని సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని అన్నారు. చిన్నతరహా, కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ఒక అవకాశంగా తీసుకొని, రాబోయే రోజుల్లో రాజకీయ రంగంలో మహిళలకు లభించే 33 శాతం ప్రాతినిధ్య అవకాశాలను గంగపుత్ర మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ వరకు గంగపుత్ర మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం ఉండాలని, గ్రామ సభల నుంచి శాసనసభ, పార్లమెంట్ వరకు గంగపుత్ర మహిళలు తమ గొంతును వినిపించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్షురాలిగా ఎన్నుకున్న సభ్యులందరికీ డాక్టర్ రమాదేవి కృతజ్ఞతలు తెలిపారు. గంగపుత్ర వర్కింగ్ ఉమెన్స్ అసోసియేషన్ అభివృద్ధికి తన పూర్తి సమయాన్ని కేటాయించి పనిచేస్తానని తెలిపారు.

**మహిళల ఐక్యతే మన బలం : పంపరి మంగ**

ప్రధాన కార్యదర్శి పంపరి మంగ మాట్లాడుతూ.. గంగపుత్ర మహిళలందరూ ఐక్యంగా ఉన్నప్పుడే సమాజంలో తమకు తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని పేర్కొన్నారు.

# ఉపాధ్యాయుల సేవలు సమాజానికి చిరస్మరణీయం

- మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి
- పాపిరెడ్డిగూడ హైస్కూల్ హెచ్ఎం కోప్పునూరి శ్రీశైలం పదవీ
- విరమణ సందర్భంగా ఘన సన్మానం



**చట్టం, షాద్ నగర్ ప్రతినిధి:** – పాపిరెడ్డిగూడ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కోప్పునూరి శ్రీశైలం పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి హాజరై పదవీ విరమణ చేస్తున్న హెచ్ఎం శ్రీశైలంను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఒక ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా శ్రీశైలం అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు. పదవీ విరమణ అనేది సేవలకు ముగింపు కాదని, జీవితంలో మరో కొత్త అధ్యాయానికి ప్రారంభమని పేర్కొంటూ, శ్రీశైలం గారు భవిష్యత్తులో మరింత సంతోషంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శశిరేఖ యాదయ్య, మహిళా అధ్యక్షురాలు రాణి, వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొని పదవీ విరమణ పొందుతున్న ప్రధానోపాధ్యాయులు కోప్పునూరి శ్రీశైలంకు శుభాకాంక్షలు తెలిపారు.

# సెప్టెంబర్ 6న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జేఏసీ నూతన కార్యవర్గ సభ్యులకు సన్మానం



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేటలో నూతనంగా ఏర్పడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జేఏసీ కార్యవర్గ సభ్యులకు సెప్టెంబర్ 6న సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల చంద్రం, జిల్లా అధ్యక్షుడు తెల్జేరు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సిద్దిపేటలో నిర్వహించిన జేఏసీ సమావేశంలో వారు మాట్లాడుతూ, సెప్టెంబర్ 6 ఆదివారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ రోడ్డులోని పాత కలెక్టర్ కార్యాలయం పక్కన ఉన్న టీచర్స్ భవన్‌లో సన్మాన కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జేఏసీ కార్యవర్గ సభ్యులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. సిద్దిపేట మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అన్ని కుల సంఘాల కార్యవర్గ సభ్యులు, నాయకులు పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలోని ప్రతి మండలం నుంచి జేఏసీ నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాముని నాగేష్, మాచవరం మహేందర్, తాళ్లపల్లి రాజు గౌడ్, వనం రమేష్, ప్రభురాజ్ గంగపుత్ర, పోతరాజ్ శంకర్, వంగ నరేష్, కోటగిరి చంద్రం గౌడ్, కరికే శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరేపల్లి గ్రామంలో 100 శాతం వనమహోత్సవం పూర్తి

- గ్రామంలో 2,400 మొక్కలు నాటినట్లు సర్పంచ్ మోనా బాయ్ వెల్లడి



**చట్టం డిచ్‌పల్లి :** డిచ్‌పల్లి మండలంలోని ఆరేపల్లి గ్రామంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేసినట్లు సర్పంచ్ మోనా బాయ్ తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 2,400 మొక్కలను నాటినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సర్పంచ్ మోనా బాయ్ కోరారు. నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గైని గంగారం పదవీ విరమణ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్




**చట్టం నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ జిల్లాలోని ఎస్ఆర్ఎస్పీ పోచంపాడ్ డ్యామ్‌సైట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన గైని గంగారం పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గైని గంగారంను మహేష్ కుమార్ గౌడ్ శాలువాతో సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగిగా సుదీర్ఘకాలం బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ శాఖకు అందించిన సేవలను కొనియాడారు. ఉద్యోగ జీవితంలో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి సహోద్యోగులు, అధికారుల అభిమానాన్ని పొందడం అభినందనీయమని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం గైని గంగారం కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ప్రశాంతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ బాధ్యతలకు ముగింపు మాత్రమేనని, జీవితంలో కొత్త అధ్యాయానికి ఆరంభమని పలువురు అధికారులు పేర్కొన్నారు. గైని గంగారం సేవలను గుర్తుచేసుకుంటూ ఆయనతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది, కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు పాల్గొని గైని గంగారంను సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

# సాగునీటి విడుదలకై ఎమ్మెల్యే భూపతి రెడ్డికి రైతుల వినతి

- సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే.. హర్షం వ్యక్తం చేసిన రైతులు
- సంబంధిత అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే



**చట్టం నిజామాబాద్ ప్రతినిధి :** వరి పంట పొట్టదశలో ఉన్న నేపథ్యంలో పంటకు సాగునీరు అందించేలా కృషి చేయాలని కోరుతూ.. డిచ్‌పల్లి మండలం ధర్మారం, మెంట్రాజ్ పల్లి బర్దీపూర్, తాడేం గ్రామాల రైతులు సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్. భూపతి రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వరి పైరు పొట్టదశలో ఉందని కావున 15 రోజులకు ఒకసారి న్యాల్కల్ మాసాని చెరువు (అలీసాగర్ ఎత్తిపోతల ద్వార) నుండి సాగునీరు అందించాలని విన్నవించారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత అధికారులతో మాట్లాడారు.. రైతుల విజ్ఞప్తి మేరకు నీరు అందించాలని, రైతులకు పంట పండించేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిత్యం ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సర్పంచ్ ఫోరం రూరల్ నియోజకవర్గ అధ్యక్షులు వాసు, పలువురు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మేయర్ ఉమారాణి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి



**చట్టం నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ నగర మేయర్ కూరగాయల ఉమారాణి కుటుంబాన్ని సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పరామర్శించారు. ఇటీవల మేయర్ ఉమారాణి మాతృమూర్తి పరమపదించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం నగరంలోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి మాతృమూర్తి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆ భగవంతుడు వారి కుటుంబానికి మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించి.. వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్ రెడ్డి, హన్మండ్లు, శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు అశోక్, రమేష్, తదితరులు ఉన్నారు.

# ధర్మారం లో సుంకరి ధావీద్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి



**చట్టం నిజామాబాద్ ప్రతినిధి :** డిచ్ పల్లి మండలం ధర్మారం(బి) గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకరి దావీద్ కుటుంబాన్ని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పరామర్శించారు. ఇటీవల దావీద్ సతీమణి అనారోగ్యంతో మరణించారు. ఈ మేరకు విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆ భగవంతుడు వారి కుటుంబానికి మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాయరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అంబర్ సింగ్, సర్పంచ్ ఫోరం నియోజకవర్గ అధ్యక్షులు వాసు తదితరులు పాల్గొన్నారు.

# భూములు కోల్పోయిన బాధితులకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కేటాయించాలి



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం రోజు కొటార్మూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఆర్మూర్ మండలంలోని కొటార్మూర్ గ్రామంలో సర్వే నెంబర్ 160 లో భూములు కోల్పోయిన పట్టాదారులకు తక్షణమే డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కేటాయించాలని, అలాగే గ్రామంలోని అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కొటార్మూర్ గ్రామాభివృద్ధి కమిటీ, సర్వసమాజ్ ప్రతినిధులు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు ఎం.ఎలీషా, కార్యదర్శి జి. మనోజ్ కుమార్, మాట్లాడుతూ గతంలో కొటార్మూర్ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 160 లో స్థానిక పేద ప్రజలు తమ భూములను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అదే స్థలంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లను నిర్మించిందని, కాబట్టి భూములు కోల్పోయిన అసలైన పట్టాదారులను గుర్తించి వారికి ఆ ఇళ్లను మొదటి ప్రాధాన్యతగా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై 2013 లోనే అధికారులకు విన్నవించగా సానుకూలంగా స్పందించారని, దానికి సంబంధించిన పత్రాలను కూడా ఇప్పుడు అధికారులకు సమర్పించినట్లు తెలిపారు. గ్రామంలో నిలువ నీడ లేని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను కూడా మంజూరు చేసి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు, జాయింట్ సెక్రెటరీ ఎన్.వీరయ్య, కోశాధికారి వి.హరిబాబు, సభ్యులు బుచ్చన్న, ప్రభాకర్, కొటార్మూర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజావాణికి స్పందన కరువు

- సంతకాలకే పరిమితమైన అధికారులు.. సిద్దిపేట అర్బన్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** ప్రజా సమస్యలపై మండల వ్యాప్తంగా ప్రజావాణిలు నిర్వహించాలన్న అధికారుల ఆదేశాలతో గత మూడు వారాలుగా కొనసాగుతున్న ప్రజావాణికి ఈ సోమవారం స్పందన కరువైంది. సుమారు 24 శాఖలకు సంబంధించి మండల అధికారులు ప్రజావాణికి హాజరు కావాలని అధికారులు ఆదేశించినప్పటికీ అధికారులు వచ్చి సంతకాలు పెట్టి వెళ్లిపోయినట్లు సమాచారం. ప్రజావాణిలో ఆరు నుండి ఏడు మంది అధికారులు మాత్రమే కనిపించారని ఆరోపణలు వస్తున్నాయి. అధికారులకు బదులుగా ఆ శాఖలో పనిచేస్తున్న కిందిస్థాయి ఉద్యోగులను ప్రజావాణి కి పంపించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు కూడా సరిగా అందుబాటులో ఉండకపోవడంతో ప్రజావాణికి స్పందన కరువైందని ఆరోపణలు ఉన్నాయి కాగా సోమవారం ప్రజావాణికి ఆరు ఫిర్యాదులు వచ్చినట్లు నోడల్ అధికారి తెలిపారు.

# గోదావరిఖని ఘటన నిందితుడిపై పీడీ యాక్ట్ పెట్టాలి

- ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలి : కందుల సంధ్యారాణి



**చట్టం, రామగుండం :** గోదావరిఖని ప్రాంతంలో ఒంటరి మహిళలు, యువతులను లక్ష్యంగా చేసుకుని లైంగిక దాడులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం హర్షణీయమని, అయితే అరెస్టుతో సరిపెట్టకుండా నిందితుడిపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి డిమాండ్ చేశారు. సోమవారం ఆమె మాట్లాడుతూ, వివిధ దినపత్రికల్లో వచ్చిన కథనాల ప్రకారం శివాజీనగర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించిన నిందితుడు మహిళలకు సాయం చేస్తానంటూ మాట కలిపి, నమ్మించి తన ద్విచక్ర వాహనంపై నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకెళ్లి లైంగిక దాడులకు పాల్పడినట్లు వెలుగులోకి రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. వయసుతో సంబంధం లేకుండా మహిళలను లక్ష్యంగా చేసుకోవడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. సీతానగర్ కూరగాయల మార్కెట్, బార్ పరిసరాల్లో సంచరిస్తూ మద్యం, గంజాయి మత్తులో బెదిరింపులకు పాల్పడినట్లు వస్తున్న ఆరోపణలపై పోలీసులు సమగ్ర విచారణ జరపాలని కోరారు. తనకు పోలీసు ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు తెలుసంటూ నిందితుడు బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో, అతని వెనుక ఎవరైనా ఉన్నారా అనే కోణంలోనూ దర్యాప్తు జరగాలని సంధ్యారాణి డిమాండ్ చేశారు. రాజకీయ అండదండలు ఉన్నట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంత పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో నిందితుడిపై ఇప్పటికే నాలుగు నుంచి ఐదు కేసులు ఉన్నట్లు సమాచారం వస్తోందని, ఇంకా పలువురు బాధితులు భయంతో బయటకు రాలేని పరిస్థితి ఉంటే వారికి పోలీసులు భరోసా కల్పించాలని సూచించారు. నిందితుడిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపడంతో పాటు, కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి బాధిత మహిళలకు త్వరితగతిన న్యాయం అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. గోదావరిఖని, రామగుండం ప్రాంతాల్లో ఒంటరి మహిళలు, కార్మిక మహిళల భద్రత కోసం ప్రత్యేక పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని, షీటీమ్స్‌ను మరింత చురుకుగా పనిచేయించాలని డిమాండ్ చేశారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవనే స్పష్టమైన సంకేతాన్ని ప్రభుత్వం ఇవ్వాలని, బాధిత మహిళలకు బీజేపీ అండగా ఉంటుందని కందుల సంధ్యారాణి తెలిపారు.

# మత్తుతో మసకబారుతున్న భవిష్యత్తు

- యువత చేతుల్లో డ్రగ్స్.. కుటుంబాల్లోకి మద్యం
- మత్తు మైకంలో పెరుగుతున్న ప్రమాదాలు
- ఆదాయంతో పాటు సామాజిక నష్టాలపై దృష్టి అవసరం



**చట్టం, షాద్‌నగర్ ప్రతినిధి:** మద్యం, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల ప్రభావం యువత భవిష్యత్తును మసకబారుస్తోంది. సరదాగా మొదలయ్యే అలవాటు క్రమంగా వ్యసనంగా మారి చదువు, ఉద్యోగం, ఆరోగ్యం, కుటుంబ ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. స్నేహితుల ఒత్తిడి, సోషల్ మీడియా ప్రభావం, ఒత్తిడి నుంచి బయటపడాలనే భావనతో యువత మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**కుటుంబాలపై తీవ్ర ప్రభావం**

మద్యం వ్యసనం ఒక్క వ్యక్తికే పరిమితం కావడం లేదు. కుటుంబ ఆదాయం తగ్గడం, అప్పులు పెరగడం, భార్యాభర్తల మధ్య గొడవలు, గృహహింస, పిల్లల చదువులకు ఆటంకం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. NFHS5 (2019-21) ప్రకారం, తెలంగాణలో 15 ఏళ్లు పైబడిన పురుషుల్లో 43.3% మంది మద్యం సేవిస్తున్నారు. ఈ గణాంకంతో తెలంగాణ దేశంలో 3వ స్థానంలో ఉంది. మద్యం కట్టడి చేయకపోతే మొదటి స్థానం లోకి వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**మత్తులో డ్రైవింగ్‌తో ముప్పు**

మద్యం లేదా డ్రగ్స్ ప్రభావంలో వాహనాలు నడపడం ప్రమాదాలకు కారణమవుతోంది. 2023 లో తెలంగాణలో మత్తు ప్రభావంతో వాహనాలు నడపడం కారణంగా 383 రోడ్డు ప్రమాదాలు నమోదై 122 మంది మృతి చెందగా, 358 మంది గాయపడ్డారు. మత్తులో డ్రైవింగ్ చేసే వ్యక్తితో పాటు రోడ్డుపై ప్రయాణించే అమాయకుల ప్రాణాలకూ ముప్పు పొంచి ఉంది.

**అవగాహనతోనే అడ్డుకట్ట**

డ్రగ్స్ నియంత్రణకు పోలీసుల చర్యలతో పాటు పాఠశాల, కళాశాల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యార్థులకు కౌన్సెలింగ్ అందించాలి. వ్యసనానికి గురైన వారికి వైద్య చికిత్స, మానసిక సహాయం, పునరావాస సేవలు అందుబాటులోకి తేవాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనించాలి. మద్యం ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయంతో పాటు.. దాని వల్ల సమాజంపై పడుతున్న ఆరోగ్య, కుటుంబ, నేర, ప్రమాదాల భారాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఖజానాకు వచ్చే ఆదాయం ఒక సంఖ్య కావచ్చు.. కానీ మత్తు కారణంగా కోల్పోయిన ప్రాణం మాత్రం ఓ కుటుంబానికి తీరని క్షోభ మిగిల్చవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు...

# పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా
- ఇచ్చిన ఇళ్ల పట్టాలను వెనక్కి తీసుకోవడం అన్యాయం: పగడాల యాదయ్య

**చట్టం, అబ్దుల్లాపూర్‌మెట్ :**

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి, పట్టాలు అందజేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన ప్రజలతో కలిసి సీపీఎం నాయకులు ఈ ఆందోళన చేపట్టారు.

**ఇచ్చిన పట్టాలను వెనక్కి తీసుకోవడం సరికాదు**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పలు ప్రాంతాల్లో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చిందని, అనంతరం వాటిని తిరిగి లాక్కున్నారని ఆరోపించారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం కాకుండా, వాస్తవంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి స్థలం అందించాలని డిమాండ్ చేశారు. గతంలో ఇళ్ల స్థలాల పట్టాలు పొందిన వారి జాబితాను పూర్తిస్థాయిలో పరిశీలించి, అర్హత కలిగిన పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆయన కోరారు. పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని అన్నారు.

**రేషన్‌లో 14 రకాల సరుకులు పంపిణీ చేయాలి**

రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ప్రస్తుతం కేవలం బియ్యం పంపిణీ చేసి చేతులు దులుపుకుంటోందని పగడాల యాదయ్య విమర్శించారు. పేదలకు అవసరమైన 14 రకాల సరుకులను రేషన్ షాపుల ద్వారా అందించాలని డిమాండ్ చేశారు.

## సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు డ్రైవింగ్.. ప్రయాణికుల ఆందోళన

- జేబీఎస్–నర్సాపూర్ బస్సులో ఘటన.. నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచితం ఇవ్వడమే కారణమా...?



**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** జేబీఎస్ నుంచి మెదక్ జిల్లా నర్సాపూర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సు నడిపినట్లు ప్రయాణికులు ఆరోపించారు. ప్రయాణికులతో నిండిన బస్సును నడుపుతున్న సమయంలో డ్రైవర్ ఫోన్‌లో మాట్లాడటం ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ ఉపయోగిస్తే ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధిస్తున్నారని, అదే నిబంధనలు ప్రజా రవాణా వాహనాల డ్రైవర్లకూ కఠినంగా అమలు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. వందలాది మంది ప్రయాణికుల భద్రత బాధ్యత కలిగిన ఆర్టీసీ డ్రైవర్లు విధుల్లో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం వల్ల చిన్న పొరపాటు జరిగినా ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని, ఇలాంటి ఘటనలపై ఆర్టీసీ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన స్పెషల్ బస్సుల్లో అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారంటూ కొందరు ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సాధారణంగా రూ.150 వరకు ఉండే టికెట్ ధరను కొన్ని స్పెషల్ సర్వీసుల్లో రూ.260 వరకు వసూలు చేసినట్లు వారు ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలవుతున్న నేపథ్యంలో పురుష ప్రయాణికులపై అదనపు ఛార్జీల భారం పడకూడదని కోరుతున్నారు. పండుగ రద్దీ పేరుతో స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసి అధిక ఛార్జీలు వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీ సేవల్లో ప్రయాణికుల భద్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించాలని, స్పెషల్ బస్సుల ఛార్జీలపై కూడా స్పష్టత ఇవ్వాలని ప్రయాణికులు కోరుతున్నారు

## ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వృద్ధుడికి తీవ్ర గాయాలు



**చట్టం కథలాపూర్:** ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడిన ఘటన కథలాపూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కథలాపూర్‌కు చెందిన తోగరి గంగారాం (75) రెండు కాళ్లతో నడవలేని వికలాంగుడు. అనాథగా జీవనం సాగిస్తున్న ఆయన ప్రతిరోజూ పాకుతూ బస్టాండ్‌కు వచ్చి చుట్టుపక్కల భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఇంటికి వెళ్తుండగా రోడ్డు దాటుతున్న సమయంలో TS 21 T 5152 నంబర్ గల ఆర్టీసీ బస్సు ఆయనను ఢీకొట్టింది. బస్టాండ్ లో ఆగి ఉన్న బస్సు ముందడ నుండి ఎప్పటిలాగే పాకుతూ బస్సు దాటి ముందరి కెళ్ళి వెళ్ళుతుండగా అదే సమయంలో కదలడంతో ప్రమాదం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో గంగారాం రెండు కాళ్లకు తీవ్రగాయాలైనట్లు సమాచారం. కథలాపూర్ గ్రామపంచాయతీ కారోబార్ బండి సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కథలాపూర్ ఎస్ఐ రవికిరణ్ తెలిపారు.

## గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి...

- కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర పిలుపు
- మండపాల వద్ద CCTV తప్పనిసరి, డీజేలకు అనుమతి లేదు – భద్రతపై కీలక ఆదేశాలు
- విగ్రహాల రవాణాలో విద్యుత్ తీగలపై అప్రమత్తంగా ఉండాలి – గతేడాది విషాదం పునరావృతం కావొద్దు




**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** గణేష్ నవరాత్రి ఉత్సవాలను సురక్షితంగా, ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర పిలుపునిచ్చారు. ఈ కామారెడ్డి కళాభారతి ప్రాంగణంలో గణేష్ ఉత్సవాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు మధుసూదన్, శ్రీనివాస్ రావు, విఠల్ రెడ్డి, మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు. గతేడాది విషాదం పునరావృతం కావొద్దు: గతేడాది మాచారెడ్డి మండలంలో విగ్రహా తరలింపు సమయంలో విద్యుత్ తీగలు తగిలి ఒకరు మృతి చెందగా, ఇంద్రానగర్ లో ముగ్గురు గాయపడ్డారని గుర్తు చేశారు. ఈ ఏడాది ఒక్క ప్రాణం కూడా పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మండపాల భద్రత నిర్వాహకులదే: ప్రజా రవాణాకు, అత్యవసర వాహనాలకు ఇబ్బంది లేకుండా మండపాలు ఏర్పాటు చేయాలి. దొంగతనాల నివారణకు CCTV తప్పనిసరి, రాత్రివేళ కాపలా ఉండాలి. ప్రతి మండపం వద్ద పోలీస్ పాయింట్ బుక్ ఉంటుందన్నారు. విగ్రహాల రవాణాలో అప్రమత్తత: విగ్రహం ఎత్తు, వాహనం ఎత్తు, రహదారిపై విద్యుత్ తీగలను ముందే పరిశీలించాలి. వేగం కంటే భద్రతకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యుత్, అగ్ని ప్రమాదాలకు చెక్: వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ వైర్లు, సౌండ్ సిస్టంలను నిపుణులతో ఏర్పాటు చేయించుకోవాలి. దీపాలు, ప్రమిదల వద్ద మండే వస్తువులు ఉంచొద్దు. ఫైర్ ఎక్స్టి గ్విషర్, నీటి బకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి. డీజేలకు నో, వదంతులకు దూరం: డీజేలు, అనవసర ఆర్భాటాలకు దూరంగా ఉండాలి. మండపాల వద్ద మద్యం, పేకాట, అసభ్య కార్యక్రమాలకు తావులేదు. సోషల్ మీడియాలో వచ్చే రెచ్చగొట్టే సందేశాలు, వదంతులను నమ్మవద్దు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తేవెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. "ఈ సంవత్సరం మన పండుగలో ఆనందమే ఉండాలి.. విషాదానికి చోటు ఉండకూడదు. భక్తి మన బలం.. భద్రత మన బాధ్యత" అని ఎస్పీ రాజేష్ చంద్ర పిలుపునిచ్చారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ బడుల్లో పెరుగుతున్న చేరికలు
- పౌష్టికాహారంతో ఏకాగ్రతకు ఊతం
- మంచిర్యాలలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**చట్టం–రామకృష్ణాపూర్ (మంచిర్యాల):**

విద్యార్థుల బంగారు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని అన్ని విధాలా బలోపేతం చేస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన, పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా వారు ఉత్సాహంగా విద్యను అభ్యసించే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను సోమవారం కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎ.భాస్కర్, అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తదితరులతో కలిసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ద్వారా ఉదయం నుంచే విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యం, ఏకాగ్రతను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల నియామకం, విద్యా ప్రమాణాల పెంపు, పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించడం ద్వారా వారి పోషకాహార భద్రతకు భరోసా కల్పిస్తున్నట్లు వివరించారు.

**బడుల వైపు.. విద్యార్థుల అడుగులు..**

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల నమోదు 7 శాతం పెరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 4 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరడం ప్రభుత్వ విద్యపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా సింగరేణి సంస్థ రూ.8 కోట్ల సీఎస్ఆర్ నిధులు అందించడం అభినందనీయమన్నారు.

**ఆధునిక వంటశాల.. భారీ సామర్థ్యం..**

సుమారు 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సెంట్రలైజ్డ్ కిచెన్‌ను నిర్మించారు. ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించేందుకు ఫుడ్ ల్యాబ్, మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్, ఆర్వో వాటర్ ప్లాంట్, బాయిలర్ ప్లాంట్, సెంట్రల్ గ్యాస్ బ్యాంక్, ఆటోమేటిక్ వెజిటబుల్ వాషింగ్ అండ్ కటింగ్ యూనిట్లను ఏర్పాటు చేశారు.

**గంటలోనే వేలాది అల్పాహారాలు..**

ఆటోమేటెడ్ స్టీమర్లతో గంటకు 5,400 ఇడ్లీలు, ఆటోమేటిక్ దోశ యంత్రంతో గంటకు 2 వేల దోశలు, పూరీ యంత్రంతో గంటకు 3 వేల పూరీలు తయారు చేసే సామర్థ్యం కిచెన్‌కు ఉంది. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు సకాలంలో వేడి అల్పాహారం అందించేలా యంత్రాంగాన్ని సిద్ధం చేశారు.

**రాష్ట్రంలో మూడో స్థానం...ఇక మొదటి స్థానమే లక్ష్యం**

విద్యార్థుల నమోదులో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా చర్యలు కొనసాగుతున్నాయని, భవిష్యత్తులో మంచిర్యాలను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు సమష్టిగా కృషి చేస్తామని అన్నారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి భారీగా నిధులు వెచ్చిస్తూ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరుస్తోందని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం వంటి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

**సేవకు సింగరేణి.. సహకారానికి ఫౌండేషన్..**

విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులతో అందిస్తున్న సహకారం అభినందనీయమని కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు పేర్కొన్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ వేలాది మంది విద్యార్థులకు పరిశుభ్రమైన, పౌష్టిక విలువలతో కూడిన అల్పాహారం అందించేలా చర్యలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4 లక్షల మంది విద్యార్థులకు ఇలాంటి అల్పాహార సేవలు అందుతున్నాయని, విద్యార్థుల ఆరోగ్యం-విద్యాభ్యాసానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

### ప్రతి విద్యార్థి ఆకలితో బడికి వెళ్లొద్దు..!

ఉదయం పూట ఆకలితో పాఠశాలలకు వెళ్లే పరిస్థితి విద్యార్థులకు లేకుండా చేయడమే స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. పౌష్టికాహారం తీసుకుని ఉత్సాహంగా తరగతులకు హాజరయ్యేలా చేయడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యం, ఏకాగ్రత, అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.





### 49 వేల మందికి పైగా.. ప్రతిరోజూ అల్పాహారం..!

**691 ప్రభుత్వ పాఠశాలలు..**
**13 జూనియర్ కళాశాలలు**

17 మండలాల పరిధిలో సేవలు
42,450 మంది పాఠశాల విద్యార్థులకు ప్రయోజనం
6,654 మంది జూనియర్ కళాశాల విద్యార్థులకు అల్పాహారం
మొత్తం 49,104 మంది విద్యార్థులకు ప్రతిరోజూ సేవలు
నాణ్యత, పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యం
సింగరేణి సీఎస్ఆర్ నిధులతో కిచెన్ నిర్మాణానికి సహకారం
హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ నిర్వహణ భాగస్వామ్యం.

## బీజేపీ కార్యాలయం ముట్టడికి యూత్ కాంగ్రెస్ యత్నం

**చట్టం, అబ్దుల్లాపూర్ మెట్ :** బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడికి తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు.

**అమిత్ షా రాజీనామాకు డిమాండ్**

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పట్ల బీజేపీ వ్యవహరించిన తీరును నిరసిస్తూ యువజన కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఉపయోగించిన ఘటనకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**బీజేపీ కార్యాలయం ఎదుట ఆందోళన**

బీజేపీ వైఖరికి నిరసనగా ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్ద యువజన కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. కార్యాలయానికి నల్లరంగు పూసి నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. అనంతరం బీజేపీ జెండాతో పాటు అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్ర ప్రభుత్వానికి, బీజేపీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

**నాయకుల అరెస్ట్.. పోలీస్‌స్టేషన్‌కు తరలింపు**

ఆందోళనను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, పాలడుగు నాగార్జునతో పాటు పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో బీజేపీ రాష్ట్ర కార్యాలయం పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

## భావితరాలకు బాసట బుల్లెట్ ట్రైన్: పచ్చిపాల రామకృష్ణ యాదవ్




**మునగాల, చట్టం:** భావితరాలకు బాసటగా నిలిచే బుల్లెట్ ట్రైన్ కోసం కోదాడ నియోజకవర్గ ప్రజలు ఉద్యమించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం గణపవరం రోడ్డు ఫ్లైఓవర్ వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ మార్చి, నేషనల్ హైవే 65 మీదుగా శంషాబాద్, సూర్యాపేట, కోదాడ, విజయవాడ ద్వారా చెన్నైకి ప్లాన్ సిద్ధం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తెలంగాణకు అన్యాయం చేస్తూ నాగార్జునసాగర్, అమరావతి మీదుగా రైలు తీసుకెళ్లాలని చూస్తున్న ఆంధ్ర పాలకుల వక్రబుద్ధిని ఆయన తప్పుపట్టారు. బుల్లెట్ ట్రైన్ వస్తే హైదరాబాద్‌కు ప్రయాణం సులువై విద్యా, ఉద్యోగ, వైద్య రంగాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. సూర్యాపేటలో ఉద్యమం తీవ్రమైందని, త్వరలోనే కోదాడలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సుధాకర్ గౌడ్, షేక్ సైదా, లింగరాజు, నగేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

**నిజామాబాద్ జిల్లా చట్టం:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 159 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీఆర్ఓ గీత, డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, ఏసీపీ శ్రీశైలంలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# కార్మిక సమస్యలపై నిర్మాణాత్మక చర్చ

**పరిష్కారానికి యాజమాన్యం సానుకూల స్పందన**



**చట్టం రామకృష్ణాపూర్ (మందమర్రి) :** సింగరేణి మందమర్రి ఏరియాలో కార్మికుల భద్రత, సంక్షేమం, ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సంబంధించిన అంశాలపై యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ మధ్య నిర్మాణాత్మక చర్చ జరిగింది. ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ అధ్యక్షతన సోమవారం జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో 21వ ఏరియా స్ట్రక్చర్ సమావేశం నిర్వహించారు. గనులు, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు, వివిధ డిపార్ట్‌మెంట్లలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఏఐటీయూసీ ప్రతినిధులు అజెండా రూపంలో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా సేఫ్టీ మెటీరియల్ లభ్యత, మైనింగ్ ఆపరేషన్లకు అవసరమైన డ్రిల్ రాడ్లు, డ్రిల్ బిట్లు, రూఫ్ బోల్టుల సరఫరా వంటి అంశాలపై చర్చించారు. భద్రతా పరికరాల విషయంలో ఎలాంటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికతో సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు.

**కెకెఓసీలో కన్వేయర్ వ్యవస్థపై దృష్టి**

కెకెఓసీలో కన్వేయర్ బెల్ట్‌కు ఇరువైపులా పేరుకుపోయిన షేల్, ఓవర్‌బర్డెన్‌ను తొలగించి బెల్ట్ ఆపరేషన్‌కు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని ప్రతినిధులు సూచించారు. కన్వేయర్ వ్యవస్థ సజావుగా కొనసాగేందుకు నిరంతర పర్యవేక్షణ, అవసరమైన మెయింటెనెన్స్ చర్యలు చేపట్టాలని కోరారు.

**స్టోర్స్‌లో మానవ వనరుల కొరత**

ఏరియా స్టోర్స్‌లో ఖాళీగా ఉన్న టెండాల్, టెండాల్ సూపర్‌వైజర్, ఎస్కార్ట్ డ్రైవర్, లోడింగ్-అన్‌లోడింగ్ జనరల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. స్టోర్స్‌లో కంప్యూటర్లు, కీలక రికార్డుల భద్రతకు ఇబ్బంది కలగకుండా దెబ్బతిన్న ఆస్బెస్టాస్ రూఫింగ్‌ను తొలగించి శాశ్వత రూఫింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు.

**డిస్పెన్సరీలో మందుల లభ్యత**

ఏరియా ఆసుపత్రి పరిధిలోని డిస్పెన్సరీల్లో కార్మికులకు వైద్యులు సూచించిన మందులు నిరంతరం అందుబాటులో ఉండేలా ఇండెంట్, స్టాక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. అత్యవసర మందుల విషయంలో స్టాక్‌అవుట్ పరిస్థితి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**సెక్యూరిటీ వ్యవస్థ పటిష్ఠం చేయాలి**

ఎస్అండ్‌పీసీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి నాణ్యమైన యూనిఫాం, షూస్, కిట్లు అందించాలని కోరారు. అవసరమైన ప్రాంతాల్లో మొబైల్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు చెక్‌పోస్టుల పరిసరాల్లో బుష్ కటింగ్ చేపట్టి విజిబిలిటీ పెంచాలని సూచించారు. పాత ఫర్నిచర్‌ను తొలగించి అవసరమైన చోట కొత్త కుర్చీలు, టేబుళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఏరియా పరిధిలోని గనులు, డిపార్ట్‌మెంట్లలో ఖాళీగా ఉన్న ఆఫీస్ అటెండెంట్ పోస్టులను భర్తీ చేసి సిబ్బంది కొరతను అధిగమించాలని యూనియన్ ప్రతినిధులు కోరారు.

**సమస్యల పరిష్కారానికి యాజమాన్యం హామీ**

కార్మిక సంఘం ప్రతిపాదించిన అంశాలపై ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ సానుకూలంగా స్పందించారు. సాధ్యమైన అంశాలను ప్రాధాన్య క్రమంలో పరిశీలించి, అర్హత ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్మికుల భద్రత విషయంలో రాజీకి తావులేదని, ఉత్పత్తి లక్ష్యాల సాధనతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. మందమర్రి ఏరియాలో ఇప్పటివరకు ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాల సాధనలో కార్మికులు, కార్మిక సంఘాలు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. సింగరేణి అభివృద్ధిలో గుర్తింపు సంఘాల పాత్ర కీలకమని, యాజమాన్యం-కార్మిక సంఘాల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో సింగరేణి అధికారులు ఎస్ఓటూజీఎం జి.ఎల్. ప్రసాద్, ఏరియా ఈ అండ్ ఎం బాలాజీ భగవతి ఝా, కేకే గ్రూప్ ఏజెంట్ ఖాదిర్, ఎస్కే గ్రూప్ ఏజెంట్ సంతోష్ కుమార్, కేకే ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాంబాబు, డీజీఎం (పర్సనల్) అశోక్, డీజీఎం (ఐఈడీ) కిరణ్ కుమార్, డీజీఎం (సివిల్) షేక్ మదీనా భాష, డీజీఎం ఏరియా స్టోర్స్ రవీందర్, డీజీఎం (సర్వే) దేశాయ్, డీవైసీఎంఓ మధు కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, రామకృష్ణపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, ఏఐటీయూసీ ఏరియా కమిటీ వైస్ ప్రెసిడెంట్ సుదర్శన్, జీఎం స్ట్రక్చర్ కమిటీ సభ్యుడు రాజేశం తదితరులు పాల్గొన్నారు.


Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com